
జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు 310 మంది

- బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జేసీ

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం మధ్యాహ్నం జిల్లా నుంచి బయలుదేరిన బస్సులను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జెండా ఊపి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి మార్గదర్శకమైన స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా నుంచి వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, ఆదర్శ రైతులు 310 మంది ఏడు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది, రైతులనుద్దేశించి జేసీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం శాశ్వతమైన అభివృద్ధికి, సుసంపన్నమైన భవిష్యత్తుకు ఈ విప్లవాత్మక స్వర్ణాంధ్ర ప్రణాళిక ఒక దిశా నిర్దేశం చేస్తుందన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన నవ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ అత్యంత ముఖ్యమైన లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేసీ తెలిపారు. అనంతరం బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టర్ ఏవో నాగభూషణం, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరిండెంటెంట్ నరసింహకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో భారీ వర్షం


బాలపల్లె వద్ద జలపాతంలా ప్రవహిస్తున్న వర్షం నీరు

- కోడూరు-తిరుపతి మార్గంలో రాకపోకలకు అంతరాయం
- ప్రధాన దారిలో భారీగా వరద నీటి ప్రవాహం
- జలమయమైన వీధులు


శెట్టిగుంట వద్ద చెరువు పొంగి పొలాలపై ప్రవహిస్తున్న నీరు

రైల్వేకోడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు గురువారం భారీ వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. రైల్వేస్టేషన్, చిట్వేలి, కోడూరు-రాజంపేట, కోడూరు-తిరుపతి ప్రధానదారుల్లో భారీ ఎత్తున వరద నీరు చేరింది. దుకాణాల్లోకి వరద నీరు చేరడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. కోడూరు-తిరుపతి మార్గంలోని బాలపల్లె వద్ద కొండల నుంచి వచ్చిన భారీ వరద నీటి ప్రవాహంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని శెట్టిగుంట చెరువు పొంగి అలుగు భారీ ఎత్తున ప్రవహిస్తోంది. గుంజననది పరవళ్లు తొక్కుతోంది. నది పరీవాహక ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులు పొంగిపొర్లుతున్నాయి. శెట్టిగుంట చెరువు నీరు భారీగా అలుగు నుంచి పారుతూ పొలాలపై ప్రవహిస్తోంది. ఆ నీరంతా గిరిజన కాలనీ వైపు వస్తుందని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు శెట్టిగుంట సర్పంచ్ శివశైలజ తెలిపారు. రాత్రి వర్షం ఉధృతం అయితే వరదనీరు భారీగా చేరే అవకాశం ఉంది. అదేవిధంగా పట్టణంలోని నరసరాంపురం వద్ద గుంజననది ఒడ్డున ఉన్న రెండు ఇంటి గోడలు కూలిపోయాయి. దీంతో అక్కడి ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉధృతంగా వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. కాగా ఒక్క రైల్వేకోడూరు మండలంలోనే గురువారం 88.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.


రైల్వేకోడూరు పట్టణ ప్రధాన దారిలో భారీగా చేరిన వరద నీరు


వ్యాపార దుకాణాల్లోకి చేరిన వరద నీరు


రైల్వేకోడూరు వద్ద ప్రవహిస్తున్న గుంజననది

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి

- హోంగార్డుల సేవలు అభినందనీయం
- కర్నూలు రీజనల్ హోంగార్డ్సు కమాండెంట్ మహేశ్‌కుమార్


హోంగార్డుల పెరేడ్‌ను తనిఖీ చేస్తున్న కర్నూలు ఆర్‌హెచ్‌సీ మహేశ్‌కుమార్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచిపేరు తేవాలని కర్నూలు రీజనల్ హోంగార్డ్సు కమాండెంట్ మహేశ్‌కుమార్ తెలిపారు. స్థానిక బీటీ కళాశాల మైదానంలో కర్నూలు రీజనల్ హోంగార్డ్సు కమాండెంట్ మహేశ్‌కుమార్ గురువారం హోంగార్డుల పెరేడ్‌ను తనిఖీ చేసి దర్బారు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ మంచిపేరు తీసుకురావాలని, హోంగార్డుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తపడాలన్నారు. కుటుంబాల గురించి ఆలోచించి ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. ప్రతి ఏడాది మెడికల్ చెకప్ చేయించుకోవాలని, హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తేనే సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి వీలవుతుందన్నారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ హోంగార్డ్సు కేవీఎస్ ప్రసాద్, కర్నూల్ రేంజ్, మదనపల్లె ఇన్‌చార్జ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు : జేసీ

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ఈనెల 13వ తేదీ శుక్రవారం అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న విపత్తు శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు ఈనెల 13వ తేదీ ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నామన్నారు. ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలని ఆదేశించారు.

వినూత్న ఆలోచనలతో

సమస్యలకు పరిష్కారం

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- రెండోరోజు సదస్సులో కలెక్టర్ శ్రీధర్


విజయవాడలో జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతో సమస్యలకు కలెక్టర్లు పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో రెండోరోజు వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సదస్సులో శాంతిభద్రతలు, ఎక్సైజ్, టూరిజం, పంచాయతీరాజ్, విద్య, నైపుణ్యాభివృద్ధి, విద్యుత్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సదస్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగ కల్పనలో పర్యాటక రంగం అతి పెద్ద రంగమన్నారు. జిల్లా స్థాయి టూరిజం కౌన్సిల్ ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్లకు సూచించారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు అవకాశాలను కల్పించాలన్నారు. అవకాశం ఉన్న ప్రతి జిల్లాలో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ తయారు చేయాలని, ప్రధానమంత్రి సూర్యఘర్, కుసుం పథకాలు విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాకు పాఠశాలలో, ఇతర విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యతలో ర్యాంకింగ్ విధానం అమలు చేస్తామని, కలెక్టర్లందరూ పోటీగా పనిచేయాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, ల్యాండ్ గ్రాబింగ్‌యాక్ట్, రెవెన్యూ సదస్సుల అమలు ద్వారా భూమి సమస్యలు లేకుండా చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వల్ల జరుగుతున్న నేరాలను అరికట్టడానికి కలెక్టర్లు, ఎస్పీలు, ఎక్సైజ్‌శాఖ, వైద్యశాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా స్థాయి అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన దిశా నిర్దేశం మేరకు జిల్లా అధికారులందరూ కార్యాచరణను రూపొందించుకొని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

కేసులు రెఫర్ చేస్తే కఠిన చర్యలు

- జిల్లా ఆసుపత్రిలో సిబ్బందిపై సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే ఆగ్రహం
- వైద్యులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు సేవలు అందించకుండా ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా వైద్యులను హెచ్చరించారు. రోగులకు అవసరమైన స్కానింగ్, ఎక్స్‌రే, ల్యాబ్ పరీక్షలు బయట చేయించుకోమని రెకమెండ్ చేస్తూ వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు వీడియో వైరల్ అయిన నేపథ్యంలో వారు స్థానిక జిల్లా ఆసుపత్రిలో గురువారం డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడికొచ్చే రోగులను బయటి ప్రాంతాలకు రెఫర్ చేయడంతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ప్రైవేటు లేబొరేటరికీ పంపిస్తున్నట్లు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యేలు..ఆసుపత్రిలో పేదలకు అందుతున్న సేవలు, ఎంతమంది వైద్యులు, సిబ్బంది ఉన్నారు? ఎంతమంది సెలవులో ఉన్నారనే అంశంపై సూపరింటెండెంట్ గాయత్రిని అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా ఎక్స్‌రే మిషన్ పనిచేయడం లేదని, రోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. క్యాష్ కవర్ల విషయమేంటని ఎమ్మెల్యే వైద్యులను ప్రశ్నించారు. ఆ కవర్లపై ఉన్న వైద్యుల పేర్లు ప్రైవేటు క్లీనిక్‌కు చెందినవని, అందులో జిల్లా ఆసుపత్రి వైద్యులు లేరని సూపరింటెండెంట్ చెప్పారు. అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బందిని ఉపయోగించుకుని ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేయాలని, ఆలస్యం చేయడం, వాయిదాలు వేసే పద్ధతికి స్వస్తి చెప్పాలని ఆదేశించారు.

పదేళ్లలో ఐటీకి దీటుగా పర్యాటక రంగం

- ఏపీ టూరిజం శాఖ తిరుపతి ఆర్‌జేడీ రమణ ప్రసాద్
- ఘనంగా ప్రారంభమైన జాతీయ సదస్సు




సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌జేడీ రమణ ప్రసాద్

పీలేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న పదేళ్ల కాలంలో ఐటీ రంగానికి దీటుగా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ తిరుపతి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రమణ ప్రసాద్ వేముల తెలిపారు. 'పర్యావరణ పర్యాటకం-సుస్థిరాభివృద్ధి' అనే అంశంపై గురువారం పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక పాలసీల కారణంగా అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ పర్యాటక రంగం అభివృద్ధివైపు వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏపీ టూరిజం పాలసీ 2024-25 పేరుతో వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించి దాని అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. ఆసియా ఖండం, మన దేశం ప్రస్తుతం పర్యాటక రంగంలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయ పర్యాటకరంగ ఆచార్యులు ఆచార్య వై.వెంకటరావు మాట్లాడుతూ పర్యావరణ పర్యాటకం కారణంగా ఆయా ప్రాంతాల్లోని స్థానికులకు వ్యాపార అవకాశాలు పెరిగి పేదరిక నిర్మూలనకు దోహదపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 'అమృత్ దరోహర్' అనే పథకాన్ని 2023లో ప్రవేశ పెట్టి పర్యాటక రంగం అభివృద్ధికి అనేక రాయితీలు కల్పిస్తోందన్నారు. విశాల సముద్ర తీరం, విభిన్న వాతావరణ పరిస్థితుల సమ్మేళనంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ పర్యాటక రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. అంతకుముందు సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు. దేశంలోని 12 విశ్వవిద్యాలయాల నుంచి ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. సదస్సుకు హాజరైన వారిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ వెంకటరమణయ్య ఘనంగా సన్మానించారు.

ఎర్రమట్టి ఊడ్చేశారు..

విద్యుత్తు స్తంభం చుట్టూ మట్టి తవ్వకం



అయిదేళ్ల వైసీపీ పాలనలో మట్టి మొదలు ఇసుక, కంకర, గ్రానైట్, మద్యం ఇలా..అవకాశం ఉన్న దేనినీ వదలలేదు. అధికారమే అడ్డుగా ప్రభుత్వ, డీకేటీ భూములే కాదు.. ప్రైవేటు భూములను ఆక్రమించారు. ఇలా స్థాయిని బట్టి వైసీపీ నేతలు ఒక్కో రంగాన్ని ఎంచుకుని పని కానిచ్చేశారు. ముఖ్యంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇలాంటి దందాలు అధికంగా జరిగాయి. ఇందులో భాగంగా కురబలకోట మండలం తెట్టు గ్రామంలోని ఎర్రమట్టిని భారీగా తవ్వేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కాదు.. ఇప్పుడు కూడా వారు అదే స్థాయిలో మట్టి తవ్వకాలు చేపడుతున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు అంటున్నారు.

- తెట్టు శ్మశానంలో భారీగా తవ్వకాలు
- ఇక్కడి ఎర్రమట్టికి మంచి డిమాండ్
- దీనిని క్యాష్ చేసుకున్న వైసీపీ నాయకులు
- టిప్పర్ ధర రూ.5 వేల నుంచి రూ.10 వేలు
- వివాదాస్పదమైన ఎర్రనేలపై అధికారులకు ఫిర్యాదు


మదనపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పడమట ప్రాంతంలో ఎక్కడా లేని ప్రత్యేకమైన ఎర్రమట్టి ఇక్కడ మాత్రమే లభ్యమవుతోంది. అలాంటి మట్టిని స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు భారీగా తవ్వకాలు చేపట్టి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. కురబలకోట మండలం తెట్టు రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-78లో 7.25 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భూమిని ప్రభుత్వం ఇదివరకే శ్మశానానికి కేటాయించగా, మిగిలిన భూమిని స్థానికంగా ఉన్న ఏడుగురు రైతులకు పట్టాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ప్రముఖ తెట్టు వేణుగోపాలస్వామి కొలువుదీరిన ఆలయం ఎదురుగా ఉన్న ఈ భూమిలో విలువైన ఎర్రమట్టి దిమ్మె (బ్లాకు)లు ఎక్కువగా ఉన్నాయి. ఇటుకల తయారీ, స్థానికంగా ఇంటి నిర్మాణాలకు, లేఅవుట్లలో రోడ్లకు, రోడ్డుకు ఇరువైపులా తోలడానికి, భూముల సారవంతానికి ఇక్కడి ఎర్రమట్టిని ఉపయోగిస్తుంటారు. మదనపల్లె మండలం సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చే తెట్టువంకకు, తెట్టు హరిజనవాడకు ఆనుకుని ఈ భూమి ఉంది.

ఇక్కడి ఎర్రమట్టికి ప్రాధాన్యతే కాదు డిమాండ్ కూడా అదే స్థాయిలో ఉంటోంది. ఇక్కడి నుంచే మదనపల్లె, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పీలేరు వరకు రవాణా చేస్తుంటారు. ఈ క్రమంలో చిన్న టిప్పర్ రూ.5 వేల నుంచి రూ.6 వేలు, పెద్ద టిప్పర్ అయితే రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. దీంతో చదునైన విశాలమైన భూమి సొంతం గుంతలమయం అయింది. సుమారు పది అడుగుల లోతు వరకూ తవ్వేయగా, అక్కడక్కడా మిగిలిన మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. అటుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ స్తంభాల చుట్టూ తవ్వేయడంతో అవి గాల్లో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. తెట్టు వంక నుంచి పైభాగంలోని గుట్ట కింద వరకూ తవ్వకాలు చేపడుతున్నారు. రిషివ్యాలీకొండల మధ్య ఉన్న లోయ ప్రాంతంలో ఇక్కడ ఎర్రమట్టి నిల్వలు అధికంగా ఉన్నాయి. ఈ భూములు ఎక్కువగా సారవంతమైనవని రైతులు చెబుతున్నారు. ఇక్కడే కాదు..తెట్టు ఎగువ భాగంలోని పులుసుగుంతల గ్రామానికి వెళ్లే రోడ్డు వెంబడి కూడా ఎర్రమట్టిని తవ్వి తరలించేశారు. తెట్టు నుంచి పులుసుగుంతల గ్రామానికి, తెట్టు నుంచి విశ్వం కళాశాల మీదుగా మదనపల్లె ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డుతో పాటు కురబలకోట మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు భారీగా ఈ మట్టిని తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఎర్రమట్టి విస్తరించిన భూములపై వివాదం నెలకొంది. శ్మశానంతో పాటు రైతులకు పట్టాలు ఇచ్చారని కొందరు చెబుతుండగా, ఈ భూమికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు కూడా హక్కు ఉందని స్థానికులు వాదిస్తున్నారు. ఇలా గ్రామ సభల్లో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు వెళ్లగా, క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి, భూమి విస్తీర్ణం, శ్మశనంతో పాటు ఎవరెవరికి పట్టాలు ఇచ్చారో తేల్చే పనిలో ఉన్నారు.


తెట్టు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్మశాన వాటిక భూమిలో చేపట్టిన ఎర్రమట్టి తవ్వకాలు


తెట్టు నుంచి పులుసుగుంతల గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఎర్రమట్టి దిమ్మెలు

ఆయన సేవలు ఆదర్శం



ఆయన అందరిలాగే సాధారణ ఉపాధ్యాయుడు. అయితే తాను పనిచేసే పాఠశాలపై ఆయన చూసే శ్రద్ధ అసాధారణం. అధ్వాన్నంగా ఉన్న పాఠశాల పరిసరాలతో పిల్లల బోధనకు ఆటంకం కలుగుతుందని భావించి సొంత నిధులతో వాటి అభివృద్ధికి నడుం బిగించారు. పలు పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ముత్తుమల రామక్రిష్ణారెడ్డి.

- సొంత నిధులు, దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి
- ఎక్కడ పనిచేస్తే అక్కడ.. ఆధునిక సౌకర్యాల కల్పన
- పరిసరాలను సుందరంగా చేయడం..
- విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా విధులు
- పలువురిచే ప్రశంసలు అందుకుంటున్న రామక్రిష్ణారెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం పెండ్లిమర్రి పంచాయతీ సమితి పాఠశాల ఉపాధ్యాయుడుగా రామక్రిష్ణారెడ్డి 1984లో బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల నిండా విద్యార్థులున్నా గ్రామం దాటి బయట ప్రదేశం చూసినవారు లేరు. దీంతో ఆయన విద్యార్థులను గిద్దలూరు నుంచి రైలులో మహానంది క్షేత్రానికి తీసుకువెళ్లారు. వారిలో మానసిక వికాసంతోపాటు ఆనందం నింపారు. అక్కడ నుంచి ఆయన సుంకేసుల పల్లె, గురప్పగారిపల్లె, బూరుగమానుపల్లె, రామేశ్వరం, ముదిరెడ్డిపల్లె, కలసపాడు తదితర పాఠశాలల్లో పనిచేశారు. అక్కడ పాఠశాలల్లో అధ్వాన్నంగా ఉన్న పరిసరాలు విద్యార్థుల బోధనకు ఆటంకంగా మారుతున్నాయని గ్రహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేశారు. సొంతనిధులు, దాతల సహకారంతో పలు పాఠశాలలను అభివృద్ధి చేశారు.

2014 సంవత్సరంలో కలసపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా బదిలీ అయ్యారు. పది మంది విద్యార్థులతో అధ్వానంగా ఉన్న పరిసరాలు, పాడుబడ్డ బడి ఆయనకు స్వాగతం పలికాయి. వెంటనే ఆయన విద్యాశాఖ అధికారుల అనుమతితో పాడుబడ్డ భవనాలు తొలగించి రూ.8 లక్షల తన సొంత నిధులను ఖర్చు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. మరో రూ.5లక్షలు గ్రామస్తులు ఆయనకు విరాళం అందించి సహకరించారు. వంట గది, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు, డాక్టర్ సర్వేపల్లె రాధాక్రిష్ణ, ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాల ఏర్పాటు, ప్రతి తరగతి గదిలో గోడలకు చిత్రాలు, విద్యుద్దీకరణ, కంప్యూటరు ఏర్పాటు, ఉద్యానవనం ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్యను 110 వరకు చేశారు.

విహార కేంద్రంగా పాఠశాలలు

రామక్రిష్ణారెడ్డి అభివృద్ధి చేసిన కలసపాడు, రామేశ్వరం పాఠశాలలు ఉద్యాన మరియు విహార కేంద్రాలుగా మారాయి. ఆయన పాఠశాలలను తీర్చిదిద్దిన విధానం చూసి చుట్టుపక్కల పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు రాష్ట్ర విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం సందర్శిస్తూ ఉండేవారు. ఆయన చేసిన అభివృద్ధిపై జిల్లా, రాష్ట్రస్థాయి విద్యాశకటాలుగా మరియు తిరుపతిలో రాష్ట్రస్థాయి విద్యాస్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ సంధ్యారాణి, భాస్కర్‌రావు, పలువురు ఆర్‌జేడీలు, డీఈవోలు ఆయన చేసిన అభివృద్ధి చూసి ప్రశంసలు కురిపించారు.



ఆకట్టుకుంటున్న టీఎల్‌ఎం

రామక్రిష్ణారెడ్డి పనిచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఆయన ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) విద్యార్థులకు ఎంతగానో ఉపయోడపడుతోంది. తరగతి గదుల నిండా దేశ నాయకుల చిత్రాలు, వారి వివరాలు చదువును శులభంగా నేర్చుకునేందుకు ఉపయోగపడుతోంది. తరగతి గదుల గోడల నిండా ఇలాంటి వాటితో నింపారు. దాంతో విద్యార్థుల్లో చదువ పట్ల ఆసక్తి పెరుగుతోంది.

పలు పురస్కారాలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ముత్తుమల రామక్రిష్ణారెడ్డి ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల నుంచి పలు పురస్కారాలు అందుకున్నారు. 2009లో ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయ అవార్డు, 2010లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2012లో అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి చందనాఖాన్ చేతుల మీదుగా సక్సెస్ స్టోరీ ఆఫ్ రామేశ్వరం అవార్డు, 2013లో అప్పటి విద్యాశాఖమంత్రి పార్థసారధి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2014లో మదర్‌తెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారిచే గురు బ్రహ్మ అవార్డు, 2019లో అప్పటి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహ్మద్‌అలీ చేతుల మీదుగా జాతీయ స్థాయి ఆవిష్కార్ అవార్డు, 2024లో వ్యాస మహర్షి పురస్కారం అందుకున్నారు.

పాఠశాలలే దేవాలయాలు

పాఠశాలలను దేవాలయాలుగా భావించి అంకితభావంతో పనిచేశాను. పిల్లల భవిష్యత్తు కోసం దాతల సహకారం, నా సొంత నిధులతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేశాను. అందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రోత్సహించి నన్ను ముందుకు నడిపారు. ప్రతి పేదబిడ్డ పాఠశాలలో ఏ లోటు రాకుండా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానం పొందాలన్నదే నా ఆశయం.

- ముత్తుమల రామక్రిష్ణారెడ్డి, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు, రామేశ్వరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల



ఉద్యానవనాన్ని తలపిస్తున్న రామేశ్వరం పాఠశాల

సుందరంగా రామేశ్వరం, కలసపాడు పాఠశాలలు

జిల్లా సరిహద్దులో పోరుమామిళ్ల మండల పరిధిలో ఉన్న రామేశ్వరం మారుమూలపల్లె. అక్కడ పాఠశాలలో రామక్రిష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టే నాటికి అధ్వాన్నంగా ఉన్న పరిసరాలు, అంతంత మాత్రం పిల్లల హాజరు ఉండేది. దీనిని చూసి మనసు చలించిన ఆయన 2005-13 సంవత్సరాల మధ్య తన సొంత నిధులు రూ.2లక్షలు పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశారు. చుట్టూ ప్రహరీగోడ, బండపరుపు, ఉద్యానవనంగా తోట, పూలమొక్కలు, దేశ నాయకుల చిత్రపటాలు, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయించారు. ఆయన చేస్తున్న పనులు చూసి గ్రామస్తులు లక్షా 46వేల రూపాయలు అందించారు. ప్రస్తుతం ఆయన మరో దఫా రామేశ్వరం పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడుగా కొనసాగుతూ మరో రెండు లక్షల రూపాయల వరకు పాఠశాలకు ఖర్చు చేశారు.



కలసపాడు ప్రాథమిక పాఠశాలలో రామక్రిష్ణారెడ్డి ఏర్పాటు చేసిన సూక్తుల బోర్డులు, గోడలకు ప్రముఖుల చిత్రాలు

జీవో 145ను రద్దు చేయండి

- కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన
- జేసీకి వినతిపత్రం అందజేత



జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఉన్న ఫస్ట్ ఏడీజే కోర్టుల్లో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం జరగాల్సిన క్రిమినల్ కేసులు జరిగే అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చేయాలని రాయచోటి న్యాయవాదులు గురువారం రెండవరోజు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కలిసి జీవో రద్దుకు తాము చేస్తున్న ఆందోళనను ప్రభుత్వానికి వివరించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో 145 వలన రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కూడా భవిష్యత్తులో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తాన్ని తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉంటుందని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఎన్‌డీపీఎస్ కేసులు కేవలం నాలుగు ప్రాంతాల్లో మాత్రమే ట్రైల్ జరిగే అవకాశం ఉందని దీనివలన కక్షిదారులు ప్రతి వాయిదాకు సుదూర ప్రాంతానికి ప్రయాణం చేసి కోర్టులకు హాజరు కావాల్సి వస్తుందన్నారు. ప్రజల ముంగిట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి కావాలని, దేశ అత్యున్నత న్యాయస్థానం ఎంత చెబుతున్నా ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా న్యాయ వ్యవస్థను ప్రజలకు దూరం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు టీ.ఈశ్వర్, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్‌రాజు, ధనుంజయ్‌కుమార్, చిన్నయ్య, రామాంజులు, మిఠాయి ఖాదర్‌బాషా, వరలక్ష్మి, జూనియర్ ఆనంద్, ఉత్తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఆర్‌సీకి అధికారుల హాజరు



మహిళా సమాఖ్య భవనంలోని జీఆర్‌సీ సెంటర్‌లో హాజరైన అధికారులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యో తి): మహిళలకు వేధింపులు, సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మదనపల్లెలో ఏర్పాటు చేసిన జెండర్ రీసోర్సు సెంటర్(జీఆర్‌సీ)కు అధికారుల గైర్హాజరుపై ఆంధ్రజ్యోతిలో గత శుక్రవారం 'కమిటీ సభ్యులెక్కడ' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ప్రతి గురువారం జీఆర్‌సీలో కమిటీ సభ్యులైన ఎంపీడీవో, సీడీపీవో, ఎస్‌ఐ, ఏపీఎం, మహిళా సమాఖ్య లీడర్లు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు హాజరు కావాలి. కానీ మదనపల్లెలో జీఆర్‌సీ ప్రారంభించిన తరువాత రెండు గురువారాలు అధికారులు, కమిటీ సభ్యులు హాజరు కాలేదు. దీనిపై గత గురువారం పరిశీలించిన ఆంధ్రజ్యోతి వార్త ప్రచురించింది. ఈ విషయమై కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ జీఆర్‌సీ సెంటర్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్ర మంలో మూడో గురువారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జీఆర్‌సీలో కమిటీ సభ్యులైన ఎంపీడీవో తాజ్‌మస్రూర్, సీడీపీవో సుజాత, ఎస్‌ఐ హరిహరప్రసాద్, ఏపీఎం సుబ్రమణ్యం, మహిళా సమాఖ్య లీడర్లు హాజరయ్యారు. జీఆర్‌సీని బలోపేతం చేసి మహిళలపై వేధింపులు, గృహహింస, లైంగిక వేధింపులు తదితర సమస్యలను ఇక్కడే ఫిర్యాదు చేసేలా, వాటిని ఇక్కడే పరిష్కరించేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

కూటమి ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల తాళాల పంపిణీలో ఎమ్మెల్యే



లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజ

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణాల్లోని నిరుపేదలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమే న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రగన్నమిట్ట వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు రద్దు చేసి, కాలయాపన చేసిందన్నారు. టిడ్కో ఇళ్ల కోసం డీడీలు చెల్లించిన ప్రజలు ఐదేళ్లు ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టి ఆరునెలల కాలంలోనే టిడ్కో ఇళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మొత్తం 39 బ్లాకుల్లో నిర్మించిన 1872 ఇళ్ల తాళాలను ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, కమిషనర్ ప్రమీల, మాజీ కౌన్సిలర్లు రాధ, లక్ష్మిదేవి, టీడీపీ నాయకులు రాటకొండ భారతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతి?

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై మృతుడి బంధువుల ఆరోపణలు

రాజంపేటటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నవోదయ కాలనీకి చెందిన రాజశేఖర్ (37) మృతి చెందిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఆకేపాడు నవోదయ కాలనీకి చెందిన రాజశేఖర్ వ్యక్తిగత కారణాల వల్ల బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం నుంచి గురువారం వరకు అతనికి వైద్యసేవలు ఆసుపత్రిలోనే అందజేశారు. అయితే గురువారం మధ్యాహ్నం రాజశేఖర్‌కు ఉన్నట్లుండి సీరియస్ కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు వెళ్లాలని వైద్యులు చేతులెత్తేసినట్లు వారి బంధువులు తెలిపారు. కడప రిమ్స్‌కు తరలిస్తుండగా రాజశేఖర్ మృతి చెందాడు. ఈ విషయమై వారి బంధువులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజశేఖర్ ఆసుపత్రికి చేరిన వెంటనే మెరుగైన వైద్య చికిత్స కోసం వేరే ఆసుపత్రికి తరలించాలని తమకు చెప్పలేదని, ఇక్కడే బాగు చేస్తామని చెప్పడంతో తాము ఏమీ చేయలేకపోయామని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని అతడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌ను వివరణ కోరగా పురుగుల మందు తాగిన రాజశేఖర్‌కు అన్నివిధాల వైద్య చికిత్సలు చేశామని, ఇందులో డాక్టర్ తప్పు లేదని, మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు వారి బంధువులు తరలిస్తుండగా చనిపోయినట్లు వారి బంధువుల ద్వారా తెలిసిందన్నారు. ఇదే విషయమై మన్నూరు సీఐ మహ్మద్‌అలీని వివరణ కోరగా.. ఈ విషయంపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

కాటేజి పనులు వెంటనే పూర్తి చేయాలి

- టూరిజం సీఈ నరసింహారావు

బి.కొత్తకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో జరుగుతున్న ఏపీ టూరిజం కాటేజిల ఆధునికీకరణ, మరమ్మతు పనులు ఈనెలాఖరుకు వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీ టూరిజం సీఈ వీవీఎల్ నరసింహారావు మేనేజర్ సాల్విన్‌రెడ్డిని ఆదేశించారు. గురువారం ఆయన ఈఈ సుబ్రమణ్యం, డీఈ శ్రీనివాస్‌లతో కలిసి హార్సిలీ హిల్స్‌ను సందర్శించారు. హిల్స్‌పై ఏపీ టూరిజం నిధులతో కాటేజీలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎక్కడా పొరబాట్లు జరగకుండా చూడాలని స్థానిక టూరిజం మేనేజర్‌ను ఆదేశించారు. ఎన్ని కాటేజిలలో పనులు జరుగుతున్నాయి, ఆ పనుల కోసం వెచ్చిస్తున్న నిధుల గురించి అధికారులకు మేనేజర్ వివరించారు.



హార్సిలీహిల్స్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

నామినేటెడ్ పదవులపై కసరత్తు

- జిల్లాలో మార్కెట్ కమిటీల్లో 150 మందికి ..
- సింగిల్ విండోల్లో 90 మందికి అవకాశం
- కసరత్తు చేస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు

కలికిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రధాన నాయకులు, క్రియాశీలక కార్యకర్తలకు మండల, నియోజకవర్గ స్థాయిల్లో పదవులు కట్టబెట్టడానికి కసరత్తు జరుగుతోంది. ప్రధానంగా మార్కెట్ కమిటీలు, సింగిల్ విండోల్లో పదవులను భర్తీ చేయడానికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీకి చెందిన ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు దీనికోసం పెద్ద ఎత్తున కసరత్తు చేపట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 10 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో మొత్తం 150 మందిని నియమించే అవకాశముంది. అదేవిధంగా 30 సింగిల్‌విండోల్లో ఒక్కో దానికి చైర్మన్‌తో సహా ముగ్గురు ప్రకారం మొత్తం 90 మందితో పర్సన్ ఇన్‌చార్జ్‌ల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గాల్లోని కొంతమంది ప్రధాన క్రియాశీలక నాయకులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లలో డైరెక్టర్లుగా నియామకాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇంకా కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్‌లను, డైరెక్టర్లను నియమించేందుకు టీడీపీ అధిష్ఠానం ప్రక్రియను కొనసాగిస్తోంది. ఈ స్థాయిలో పదవులు పొందలేని వారికి నియోజకవర్గ స్థాయిలో సముచిత ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన కారణంగానే మార్కెట్ కమిటీలు, సింగిల్ విండోల్లో నియామకాలు ఆలస్యమవుతున్నట్లు కూడా చెబుతున్నారు.

మార్కెట్ కమిటీ పదవులకు రిజర్వేషన్లు

జిల్లాలో ప్రస్తుతం మొత్తం 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. 2019 డిసెంబరు 12న ప్రకటించిన 120 జీవోతో అప్పటి ప్రభుత్వం మార్కెట్ కమిటీల పరిధులను పునర్వ్యవస్థీకరించింది. కొన్ని మండలాలను అటూ ఇటూ మార్చి సర్దుబాటు చేశారు. ఈ సందర్భంలోనే వాల్మీకిపురం ఏఎంసీని విడగొట్టి కలికిరి, కలకడ మండలాలకు కలిపి కలికిరి ఏఎంసీని కొత్తగా ప్రకటించారు. అదే ఏడాది మార్కెట్ కమిటీల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లను కూడా అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. ఆ తరువాత 2020-22 కాలానికి రెండేళ్ల గడువుతో నామినేటెడ్ కమిటీలను ప్రకటించారు. ఈ గడువు పూర్తయిన అనంతరం రెండో విడతగా కొన్ని కమిటీలను యథాతథంగా మరో రెండేళ్లు కొనసాగించడమో లేక తరువాత రెండేళ్ల కాలానికి కొత్త కమిటీలను నామినేట్ చేయడమో జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ కమిటీలన్నీ రద్దయ్యాయి. తాజాగా ఇప్పుడు కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్లతోనే కమిటీల నియామకం చేపట్టాలని మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో



ఈ విధానాన్నే ఇప్పుడు కూడా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు స్పష్టత వచ్చింది. రిజర్వేషన్లు మొదటిసారిగా అమల్లోకి వచ్చిన తరువాత రెండు పర్యాయాలు కమిటీల నియామకాలు జరిగాయి. రెండో పర్యాయం ఏర్పాటైన కమిటీలకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ నామినేటెడ్ సభ్యులను భర్తీ చేశారు. ఇప్పుడు కూడా ఇదే రోస్టర్ విధానాన్నే కొనసాగించనున్నట్లు చెబుతున్నారు. అంటే జిల్లాలోని 10 మార్కెట్ కమిటీలు ఈ ఏడాది రద్దయ్యేనాటికి రెండోసారి రోస్టర్ విధానంలో రిజర్వేషన్లు ఇలా కొనసాగాయి. రాజంపేట మార్కెట్ కమిటీ ఓసీ (మహిళ), రైల్వేకోడూరు కమిటీ ఓసీ (జనరల్), రాయచోటి బీసీ (జనరల్), లక్కిరెడ్డిపల్లె ఓసీ (జనరల్), మదనపల్లె ఓసీ (జనరల్), పీలేరు బీసీ (జనరల్), కలికిరి ఎస్సీ (మహిళ), వాల్మీకిపురం ఎస్టీ (మహిళ), తంబళ్ళపల్లె (ములకలచెరువు) బీసీ (మహిళ), బి.కొత్తకోట (అంగళ్లు) ఓసీ (మహిళ).

అన్ని పదవుల్లోనూ మహిళలకు 50 శాతం

జిల్లాలోని పది మార్కెట్ కమిటీల్లో ఒక్కో దానికి చైర్మన్, వైస్ చైర్మన్‌లతో కలిపి వివిధ కేటగిరీల్లోనుంచి 15 మందిని నామినేట్ చేయాల్సి ఉంది. వీరు కాకుండా ప్రతి కమిటీకి సంబంధిత ఎమ్మెల్యే గౌరవాధ్యక్షుడిగా, సింగిల్ విండో అధ్యక్షుడు సభ్యుడిగా నియామకవుతారు. రిజర్వేషన్లను కేటాయించడానికి జిల్లాను యూనిట్‌గా పరిగణిస్తారు. ఈ ప్రక్రియ ప్రకారం జిల్లాలోని 10 ఏఎంసీల్లో ఐదింటికి తప్పనిసరిగా మహిళా చైర్మన్లను నియమించాల్సి ఉంది. ఇక ప్రతి కమిటీ సభ్యుల్లో సైతం 50 శాతం డైరెక్టర్ పదవులు మహిళలకే దక్కుతాయి. అంటే ప్రతి కమిటీలోనూ ఏడు లేక 8 మంది మహిళలను నియమించనున్నారు. అదేవిధంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కులాల వారీగా 50 శాతం కమిటీలు అంటే జిల్లాలో 5 కమిటీలు రిజర్వ్ కానున్నాయి. మిగతా ఐదు కమిటీలు ఇతరులకు కేటాయిస్తారు. యాభై శాతం రిజర్వేషన్లలో బీసీ, మైనారిటీలకు కలిపి 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం చైర్మన్, డైరెక్టరు పదవులు కేటాయించనున్నారు. తాజా నియామకాల్లో పాటించే రోస్టర్ విధానంలో రెండో రోస్టర్ (2022-24)లో జరిగిన కేటాయింపులు పూర్తిగా మారిపోనున్నాయి. ఇందులో కలికిరి మార్కెట్ కమిటీకి రెండో రోస్టర్‌నే పాటించాల్సి ఉందని చెబుతున్నారు. 2020-22 మొదటి విడతలో కలికిరి ఏఎంసీ చైర్మన్ పదవిని ఓసీ జనరల్‌కు కేటాయించారు. రెండో విడత 2022-24లో కలికిరి ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించారు. అయితే రెండో విడతలో ఎస్సీ మహిళ నియామకం జరపకుండానే గడువు పూర్తయ్యింది. దీంతో రోస్టర్ విధానం కొనసాగాల్సి ఉన్నందువల్ల కలికిరి చైర్మన్ పదవిని మూడో రోస్టర్ (2024-25)లో యథాతథంగా ఎస్సీ మహిళకే కేటాయించాల్సి ఉంది. దీంతో జిల్లా స్థాయిలో కూడా మూడో రోస్టర్‌లో మరిన్ని మార్పులు చోటు చేసుకోనున్నాయని తెలుస్తోంది.



డ్యూటీలకు డుమ్మా కొడితే సెలవే

- ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు
- జిల్లా ఖజానాశాఖలో ప్రక్షాళన

కడప కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆ శాఖ జిల్లా ఆర్థిక వ్యవరాలను చక్కబెట్టే కీలకశాఖ. 20 వేల మంది ఉద్యోగులు, మరో 19వేల మంది పెన్షనర్లకు సంబంధించి జీతబత్యాలు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. సంక్షేమం అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.120 కోట్ల వరకు నెలనెలా చెల్లింపులు ఉంటాయి. అలాగే ప్రభుత్వానికి కూడా జిల్లా వ్యాప్తంగా పన్నుల చెల్లింపుల రూపంలో రూ.150 కోట్లు వరకు ఖజానాకు జమ అవుతుంది. ఇంతటి కీలక శాఖలో ఉద్యోగులు విధులకు ఎప్పుడు వస్తారో.. అసలు వస్తారో రారో తెలియని పరిస్థితి. తరచూ వీళ్లు విధులకు డుమ్మాలు కొట్టడంలో ఆరితేరారనే విమర్శలు ఉన్నాయి. అయితే నెలనెల లక్షల్లో జీతాలు తీసుకోవడంలో సిద్ధహస్తులని చెబుతున్నారు. వీరి వ్యవహారశైలిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఖజానాశాఖ రాష్ట్ర డైరెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టాల్సిన ఎస్‌టీఓలు, సిబ్బంది పనిచేసే కార్యాలయాల్లో ఉండకపోవడంపై జిల్లా డిప్యూటీ డైరెక్టర్లకు తలంటి.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగులు, పెన్షనర్లకు జవాబు దారీతనంగా పనిచేసి ప్రభుత్వాకి చెడ్డపేరు రాకుండా చూడాల్సిన ఉద్యోగులు గాడి తప్పడంపై ఎఫ్ఆర్ఎస్ (పేస్ రికగ్నేషన్ సిస్టమ్) అమలుకు శ్రీకారం చుట్టారు. విధులకు డుమ్మా కొట్టే ఉద్యోగులు, సిబ్బంది తాము పని చేసే కార్యాలయాలకు వచ్చి ఎఫ్ఆర్‌సీ వేస్తే సరి.. లేకపోతే వాళ్లకు సెలవు ఖాయంగా మారడంతో కొందరి ఉద్యోగులు జీర్ణించుకోలేక పోతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా...

ఖజానా శాఖలో ఉండి ఉద్యోగాలు వెలగబెట్టాల్సిన కొందరు ఎస్టీఓలు (సబ్ ట్రజరీ ఆఫీసర్లు) సీఎఫ్ఎంఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా మారారనే విమర్శలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల తరహాలోనే ల్యాప్‌ట్యాపులను సంకన పెట్టుకొని వర్క్‌ఫ్రం హోం పద్ధతిలో ఇన్నాళ్లు ఇళ్ల వద్దనే సీఎఫ్ఎంఎస్ బిల్లులను, ఆఫీసు వ్యవహారాలను చక్కబెట్టే వారు. దీంతో జిల్లా కార్యాలయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సందేహాలు చెప్పే నాథుడే కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ప్రముఖులకు సంబం ధించిన ఇరువురు ఎస్టీవోలు డ్యూటీలకు డమ్మాలు కొట్టినా అధికారి పట్టించుకునేవాడు కాదనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాదు ఉద్యో గులు జిల్లా కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించిన తమ అరియర్స్, పెన్షన్లు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్సుమెంట్ లాంటి ఆర్థిక వ్యవహారాలకు చెందిన పైళ్లు ఏదశలో ఉన్నాయో తెలుసుకోవాలంటే నగటు ఉద్యోగికి తల నొప్పిగా మారింది. ఇపుడు రాష్ట్ర ఆర్థికశాఖ డైరెక్టర్ నిఘా పెట్టడంతో వీరి ఆటలకు చెక్ పడినట్లయ్యింది.

ఎఫ్ఆర్ఎస్‌కు టోకరా?

ఖజానాశాఖ ఉద్యోగులకు ఎన్ని ఆంక్షలు పెట్టినా.. వాటిని తమకు అనుకూలంగా మార్చు కోవడంలో దిట్టలంటున్నారు. ఉద్యో గులు జవాబుదారీతనంగా కార్యాలయాల్లో పని చేసేలా పేస్ రికగ్నేషన్ సిస్టంను ప్రభుత్వం తెస్తే దానిని కూడా కొందరు అనుకూలంగా మార్చు కుంటున్నారని సహ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కొందరు ఆఫీసు పనుల సాకుతో ఎఫ్ ఆర్ఎస్ వేసుకొని ఎంచక్కా తమ సొంత పనులు చేసు కుంటూ.. మళ్లీ సాయంత్రం వేళల్లో ఏదో ఒక సమయంలో.. అదే లోకేషన్‌కు వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసుకుంటూ టోకరా కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరి కొందరు ఎస్టీవోలు ఎంక్వైరీల పేరుతో ఎక్కడో ఏదో ఒక ఊరిలో ఉండి అక్కడ నుంచి టూర్ అనే ఆప్షన్ ద్వారా హాజరు వేసుకుంటూ విధులకు డుమ్మాలు కొడుతున్నట్లు సమాచారం.

సీనియర్ల స్థానంలో జూనియర్లకు పెద్ద పీట

సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లుతున్న సమయంలో జీత భత్యాలు, పెన్షన్లు సీఎఫ్ఎంఎస్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో జరిగే ఈ రోజుల్లో ఆర్థికశాఖ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులకు కాసులు కురిపిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. గతంలో బిల్లుబిల్లుకు ఎంతో కొంత సమర్పించుకుంటేనే ట్రెజరీలో పాస్ అయ్యేవని ఆశాఖకు పెద్ద మచ్చే ఉండేది. కానీ ఇపుడు కూడా ఏడాది కాలంగా పెండింగ్‌లో పడిన అరియర్స్, ఇతరత్రా పెండింగ్ బిల్లులు చేయా లంటే లంచం ఇస్తేనే బిల్లులు పాస్ అన్నట్లుగా సాగుతోందనేది నగ్న సత్యం.

ఈ విషయాలపై జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లను వివరణ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం ఖజానాశాఖ ఉద్యోగులు కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తించేలా పేస్ రికగ్నేషన్ సిస్టం అమలు చేస్తోంది. పనిచేసే కార్యాలయాల పరిధిలోనే వాళ్లు ఉదయం-సాయంత్రం ఎఫ్ఆర్ఎస్ వేయాల్సి ఉంటుంది. వాళ్లు కార్యాలయాల్లో ఉన్నారా లేదా అనే విషయాలను పరిశీలించడం జరుగుతోంది. కొందరు ఉద్యోగులు పాత పద్ధతిలో ఉన్నారు. లంచాలు తీసుకుంటున్నట్లు, బిల్లుల పాస్‌కు పైసలు అడిగినట్టు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వేపరాల విద్యార్థులు


వెంకట హరిణి, సుప్రజ

మైలవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో భారతీయ విజ్ఞాన మండలి నిర్వహించే కౌశల్ క్విజ్ పోటీలకు వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెంకటహరిణి, సుప్రజ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలయ్య తెలిపారు. వీరు ఈనెల 30వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు పాఠశాల కోఆర్డినేటర్‌గా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నరసింహులు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

15న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 7-30 గంటలకు అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ప్రధానంగా ఎంపికలకు వచ్చే వారు తమ ఆధార్‌కార్డు కాపీ, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్, (ఫారమ్-5) పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, ఒరిజినల్‌తో పాటు తమ కిట్ బ్యాగ్‌లు కూడా వెంట తీసుకురావాలని సూచించారు.

రైల్వే ఎన్నికల్లో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ విజయం


విజయోత్సవంలో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ నేతలు

కొండాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధి కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ విజయం సాధించినట్లు కడప బ్రాంచి అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి ఈశ్వరయ్య తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. కాగా గురువారం గుంతకల్లులో కౌంటింగ్ జరిగినట్లు వారు తెలిపారు. తమ సంఘం విజయం సాధించడంపై వారు కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యానుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి


శివశంకర్ మృతదేహం

రామాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన సానే శివశంకర్(30) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... సానే శివశంకర్‌కు రెండేళ్ల క్రితం కడపలో నివాసముంటున్న తన అక్క కూతురు రోహిణితో వివాహమైంది. వీరికి ఇంతవరకు పిల్లలు లేరు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ.. తరచూ మద్యం సేవించేవాడు. రోజు మాదిరే బుధవారం రాత్రి కూడా తాగి రావడంతో అతని తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన శివశంకర్ జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయాడు. పొద్దుపోయాక అతని తండ్రి గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి



కొండాపురం, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగడిపల్లె రైల్వే స్టేషన్‌లో గురువారం రైలుకింద పడి చప్పిడి రేణుకారెడ్డి (54) అనే వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు తిరుపతి-హుబ్లీ ప్యాసింజర్ రైలుకింద పడి చనిపోయాడు. ఇతను రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డడా లేదా రైలు ఎక్కుతూ కింద పడ్డాడా మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో విచారిస్తున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇతను ఆర్టీ పీపీ కేవిరెడ్డి నగర్‌కు చెందినవాడిగా గుర్తించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

సింహాద్రిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వై.కొత్తపల్లి గ్రామంలో గురువారం రోడ్డు ప్రమాదంలో కొక్కంటి. రామసుబ్బారెడ్డి(73) అనే వృద్ధుడు మృతి చెందాడు. సింహాద్రిపురం ఎస్ఐ తులసి నాగప్రసాద్ సమాచారం మేరకు రామసుబ్బారెడ్డి ఉదయాన్నే తన టీవీఎస్ బైక్‌పై పొలం వద్దకు వెలుతుండగా ఎదురుగా బొలేరా వాహనం వచ్చి డీకొట్టింది. దీంతో రామసుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారులు కలరు. మృతుని మనువడు సంధీప్‌రెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతులు లేని బోటు సీజ్

జమ్మలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న బోటును ఇరిగేషన్‌శాఖ అధికారులు సీజ్ చేశారు. గురువారం గండికోట సర్పంచ్ కొంత మంది పర్యాటకులతో అనుమతి లేకుండా బోటు షికారు చేయిస్తున్నట్లు సమాచారం రావడంతో మైలవరం ఇరిగేషన్‌శాఖ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. జలాశయంలో ఎవరైనా అనుమతి లేకుండా బోటు నడిపితే చర్యలు తప్పవన్నారు. బోటు షికారుకు అనుమతులు తప్పనిసరి అని ఏఈ తెలిపారు.

వర్షానికి కూలిన చింతచెట్టు... తప్పిన ప్రమాదం



పుల్లంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై హైవేపక్కనే ఉన్న పెద్ద చింత చెట్టు జడివానకు కూలిపోయింది. దీంతో ఓ ఇల్లు పూర్తిగా దెబ్బతినగా 2 విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. చెట్టు కూలిన సమయంలో రోడ్డుపైన, ధ్వంసమైన ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మండల పరిధిలోని పుత్తనవారిపల్లె వద్ద జాతీయ రహదారి పక్కనే పెద్ద చింత చెట్టు ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న జడివానకు గురువారం సాయంత్రం ఉన్నఫళంగా కూలిపోయింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలపై పడడంతో పూర్తిగా విరిగిపోయాయి. పక్కనే ఉన్న ఇల్లు కూడా పూర్తిగా దెబ్బ తినింది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ లేక ప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

పోరుమామిళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతులు లేకుండా జాతీయ రహదారి పనులకు మట్టిని తరలిస్తుండగా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. చిన్నాయపల్లె రెవెన్యూ సదస్సు ముగించుకుని వస్తుండగా మట్టిని తరలిస్తున్నారన్న విషయం తెలియడంతో బుధవారం రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గురువారం కూడా మరో ప్రాంతం నుంచి రెండు టిప్పర్లు మట్టిని తరలిస్తుండగా వాటిని కూడా తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రౌన్ స్ఫూర్తితో భావితరాలకు ఆదర్శంగా నిలవాలి

- వైవీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి


బ్రౌన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్య కె.కృష్ణారెడ్డి

కడప కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విదేశీయుడైనా తెలుగుభాషా అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సీపీ బ్రౌన్ స్ఫూర్తితో యువత తెలుగుపై మక్కువ పెంచుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని వైవీయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. వైవీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని సమావేశ మందిరంలో బ్రౌన్ 141వ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత బ్రౌన్ చిత్రపటానికి అతిథులతో కలిసి పూలమాల సమర్పించి మాట్లాడారు. 19వ శతాబ్దంలో సీపీ బ్రౌన్ అంత గొప్పగా శ్రమించకుంటే తెలుగు భాషా సాహిత్యం అధోగతి పాలయ్యేదన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని విదేశీయులకు చాటిచెప్పాడన్నారు. ఇవాళ తెలుగు భాషా సాహిత్యం ఇంతగా వెలుగొందడానికి కారణభూతుడు బ్రౌన్ అని కొనియాడారు. వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాధరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో తెలుగు కావ్యాలను పరిష్కరింపచేసిన ఘనత సీపీ బ్రౌన్‌దే అన్నారు. అనంతరం బ్రౌన్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పద్యపఠన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి, సహాయ సంచాలకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఎం.వినోదిని, పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలి : డీపీవో


సమావేశంలో మాట్లాడతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలని.. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీలో ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా చెన్నూరులో గురువారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామాభివృద్ధికి ఎన్నో రకాల ప్రణాళికలు పంచాయతీల ద్వారా తయారు చేయడం జరిగిందన్నారు. అవన్నీ జీనవాధారంగా ఉన్నపుడు మాత్రమే జరిగిన అభివృద్ధికి సార్థకత వుంటుందన్నారు. అన్నిశాఖల అధికారులు సర్పంచులతో కలిసి ప్రజల కోసం పాటుపడాలన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆశయమన్నారు. ఇందుకోసం ప్రతీ మండలంలో రెండు రోజుల పాటు అందరికీ అవగాహనతో కూడిన శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఈఓఆర్‌డీ సురేష్‌బాబు, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు మల్లికార్జునరావు, ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్, సర్పంచ్‌లు చంద్రయాదవ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కార్యదర్శులు గురవేశ్వరరావు, శివకుమార్, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

- ట్రిపుల్‌ఐటీని తనిఖీ చేసిన వీసీ విజయ్‌కుమార్


ట్రిపుల్‌ఐటీలో మెస్‌ను పరిశీలించి సూచనలిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ విజయ్‌కుమార్

వేంపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ఆదేశించారు. కొద్దిరోజులుగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు కొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని పత్రికల్లో రావడంతో వీసీ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని గురువారం సందర్శించారు. మెస్‌లను తనిఖీ చేశారు. ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థులు, అధికారులతో మాట్లాడి పరిస్థతిని వాకబుచేశారు. ప్రధానంగా ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు లేకపోవడం వల్ల బయట నుంచి ఫుడ్ తెచ్చుకుంటున్నారని, పాత క్యాంపస్‌లోని ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఇక్కడి మసాలాలు పడకపోవడంతో కొంత ఇబ్బంది పరిస్థితి ఎదురైందని వీసీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, క్యాంటీన్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సండ్ర, డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ పెనుగొండ రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్యాంటీన్లను త్వరగా ఏర్పాటు చేయాలి

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సుమారు 8500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరితో పాటు అధ్యాపకులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అక్కడ గతంలో ఉన్న క్యాంటీన్లు మూతపడ్డాయి. కొత్త క్యాంటీన్లు ఏర్పాటు చేయలేదు. సుమారు రెండు నెలలకు పైగా కావస్తున్నా క్యాంటీన్లు లేకపోవడతో విద్యార్థులు బయటఫుడ్ తెప్పించుకుంటున్నారు. క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే ఇక్కడే అందుబాటులో ఉంటుందని విద్యార్థులు మొరపెట్టుకుంటున్నా అధికారులు సాత్సారం చేస్తున్నారు. ప్రధానంగా క్యాంటీన్ల ఏర్పాటు విషయంలో రాజకీయం నడుస్తోంది. వైసీపీ, టీడీపీకి చెందిన నాయకులు తమ వారికే తెప్పించుకోవాలన్న పట్టుదలతో అధికారులపై ఒత్తిడి తేవడంతో పాటు విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లారు. అయినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో క్యాంటీన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. వీటిని అధిగమించి త్వరగా క్యాంటీన్ల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులపై ఉంది.

గంగపేరూరు సాగునీటి సంఘాల ఓటరు లిస్టుపై ఫిర్యాదు


జేసీ అదితిసింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపేరూరు సాగునీటి సంఘాల ఓటరు లిస్టుపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు స్థానిక టీడీపీ నాయకులు, మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ వెంకటనరసయ్య, గంగపేరూరు ఎంపీటీసీ సుబ్బరాయుడు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం ఓటరు లిస్టును, నోటీసును బోర్డులో పెట్టిన విధంగా కాకుండా గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ చెప్పిన విధంగా ఆరు టీసీ నెంబర్లు పరిధిలో నూతనంగా దాదాపు 100 ఓట్లను చేర్చారని ఆరోపిస్తున్నారు. వీఆర్వో వైసీపీ వ్యక్తులతో కలిసి రెండు రోజుల్లో ఎన్నికలు ఉన్న సమయంలో ఇలా చేయడం ఏమిటని తహశీల్దారు రమణమ్మను ప్రశ్నించారు. వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి మంత్రి వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించి చర్యలు చేపడతామని తెలిపినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

కడపలో మజ్దూర్ యూనియన్ సంబరాలు



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు సంఘ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించింది. గురువారం కడప రైల్వేస్టేషన్‌లో మజ్దూర్ యూనియన్ నాయకులు బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. తమ యూనయన్‌ని గెలిపించిన రైల్వే ఉద్యోగులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్.మొహిద్దీన్ మృతి



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మాజీ రాష్ట్ర మైనార్టీ కమిషన్ మెంబర్ ఎస్ మొహిద్దీన్ అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందాడు. ఈయన 1981 నుంచి చాలా పర్యాయాలు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అందరితో సోదరభావంతో మసలిన మొహిద్దీన్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు సంతాపం తెలిపారు.

రైల్వే అభివృద్ధికి కృషి చేయండి



సీఎం రమే‌ష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నందలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని ఢిల్లీలో రైల్వేస్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎంపీ సీఎం రమే‌ష్‌ను ఆయన నివాసంలో కలిసి కోరినట్లు బీజేపీ నాయకులు షబ్బీర్‌అహ్మద్, పోతురాజు మస్తానయ్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ నందలూరులో గతంలో రైల్వేకు ఉన్న ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. రైల్వేమంత్రిత్వ శాఖతో చర్చించి నందలూరు రైల్వేపరంగా అభివృద్ధికి కృషి చేయాలని వినతి పత్రం ద్వారా కోరామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హిమగిరినాథ్‌యాదవ్, టీడీపీ నాయకులు మోడపోతుల సుధాకర్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



ముళ్లపొదల్లోకి వెళ్లిన బస్సు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుప్రమాదం తప్పింది. వివరాల మేరకు.. గురువారం కడప చెన్నై ప్రధాన రహదారి సాయిబాబా గుడి సమీపంలో సత్యవేడు ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ39జెడ్ 0190 బస్సు హైదరాబాద్ నుంచి తిరుపతికి వస్తుండగా కోడూరు నుంచి కడప వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో బస్సు పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ గాయపడ్డాడు. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటనపై ఆర్టీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత

సిద్దవటం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. పలు భూ సమస్యలపై ఆ ప్రాంత రైతులు అర్జీలు సమర్పించి సమస్య పరిష్కారం చేయాలని అధికారులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవీలత మాట్లాడారు. మండల సర్వేయర్ సుదర్శన్, వీఆర్వో సంటయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ తరగతులు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగార్జున తెలిపారు. గురువారం పట్టణంలోని మండల కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి నీటి సమృద్ధి, పరిశుభ్రత, సామాజిక న్యాయం తదితర కార్యక్రమాలపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

రైల్వేకోడూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లె డప్పు కళాకారులకు పింఛన్లు, ఇళ్ల స్థలాలను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య తెలిపారు. గురువారం మండలంలోని వెంకటరెడ్డిపల్లె అరుంధతివాడను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేక ఒక ఇంట్లోనే రెండు నుంచి మూడు కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన

రామాపురం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు రవాణా సౌకర్యాలు విస్తరిస్తున్న కొద్దీ రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోందని, వీటిని నివారించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రామాపురం ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డిలు అన్నారు. బండపల్లి పంచాయతీ పరిధిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 50 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల యజమాని మన్నేరు భాస్కర్, పోలీసులు పాల్గొన్నారు.

రాజంపేటలో ఓ మోస్తరు వర్షం

● రోడ్లన్నీ జలమయం

రాజంపేటటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో తుఫాను ప్రభావం వల్ల గురువారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీని వల్ల రాజంపేట పట్టణంలోని రోడ్లతో పాటు గ్రామీణ రోడ్లలో వరదనీరు ప్రవహించింది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వరదనీరు ప్రవహించడంతో పాదచారులకు ఇబ్బంది కలిగింది. ఉదయం నుంచి చెదురు ముదురు చినుకులు కురుస్తుండడంతో బయట తిరిగేందుకు జనజీవనానికి ఇబ్బంది కలిగింది. రాజంపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, మన్నూరు, ఉస్మాన్‌నగర్, బలిజపల్లెరోడ్డు, మదనగోపాలపురం రోడ్డు, తాళ్లపాక చుట్టుపక్కల రోడ్లలో వర్షపునీరు చేరడంతో రోడ్లపై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పెనగలూరులో...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ఉపరితల ఆవర్తనం కారణంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. మూగవారిపల్లె దగ్గర ఉన్న ఎలిమెంటరీ పాఠశాల రోడ్డుకు ఇరువైపుల ఉన్న డ్రైనేజీ కాలువను కొంతమంది స్వార్థపరులు పూడ్చివేయడంతో వర్షపునీరంతా పాఠశాలలోకి చేరింది. అందువల్ల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉండేందుకు వీలులేకపోవడంతో విద్యార్థులను ఇళ్లకు పంపించాల్సి వచ్చింది. కాగా నిల్వ ఉన్న వర్షపునీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రాజంపేట మండలం తాళ్లపాక రోడ్డులో ప్రవహిస్తున్న వరదనీరు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి : డీపీవో

రాయచోటిటౌన్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో స్థానికీకరణ ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి పేర్కొన్నారు. గురువారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్ అధ్యక్షతన మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ కడప జిల్లా వారి ఆదేశాల మేరకు జరిగిన మండల స్థాయి శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ రాయచోటి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని గ్రామ సచివాలయాల ఉద్యోగులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే స్థానికంగా లభించే వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

విభిన్న ప్రతిభావంతులకు పురస్కారాలు

రాజంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు రాజంపేటలోని ఓ కల్యాణమండపంలో అన్నమయ్య సేవా ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేశారు. ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రమేష్ నాయుడు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, టీడీపీ పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. అదేవిధంగా వారికి పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని భవన నిర్మాణానికి సహకరిస్తామని తెలిపారు. క్రీడల్లో రాణించిన 50 మంది ప్రతిభావంతులకు అన్నమయ్య సేవా పురస్కారాలను అందజేసి సత్కరించారు.



విభిన్న ప్రతిభావంతులను సత్కరిస్తున్న అధికార కూటమి నేతలు

రామాలయానికి చేరుకున్న ఆకేపాటి పాదయాత్ర



పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

ఒంటిమిట్ట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పదో పాదయాత్ర గురువారం సాయంత్రం స్థానిక రామాలయానికి చేరుకుంది. పాదయాత్ర వెంబడి పెద్దఎత్తున చెక్కభజనలు, బాణాసంచా కాలుస్తూ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి తలనీలాలు సమర్పించి సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రకు డిప్యూటీ మాజీ సీఎం అంజాద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, నందకిషోర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై మండలంలోని సమస్యలను చర్చించారు. మండల వ్యాప్తంగా రాబోయే సీజనల్ సమయంలో శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వైద్యసిబ్బంది నిరంతరం పల్లెల్లో అందుబాటులో ఉండాలని అధికారులకు ప్రజాప్రతినిధులు సూచించారు. అర్హులైనవారికి గృహాలు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య హాజరై మండలంలోని సమస్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఏపీపీ అక్కి లక్ష్మీదేవి, డాక్టర్ హేమశ్వేత, ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి, పంచాయతి కృష్ణప్రసాద్, మండల అధికారులు పాల్గొన్నారు.

అంకిపల్లె శివకుమార్‌కు అవార్డు

ఓబులవారిపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా గురువారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ అవార్డుకు 2024 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అంకిపల్లె శివకుమార్‌కు దక్కింది. ఈ మేరకు హ్యూమన్‌రైట్స్ ఆక్టివిస్ట్ అవార్డు, భారత గౌరవ అవార్డును వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ అన్సారి చేతులమీదుగా పొందినట్లు అవార్డు గ్రహీత తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండలానికి చెందిన తాను జిల్లా, నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించానని, ఇందుకు తనను గుర్తించి ఈ పురస్కారాన్ని ఇచ్చినట్లు వారు తెలిపారు. కాగా పురస్కారం దక్కేందుకు కృషి చేసిన వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సి జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ డాక్టర్ ఎంఆర్ అన్సారి, నేషనల్ యాక్టింగ్ ప్రెసిడెంట్ మౌలానా అన్వర్ ఉల్ హక్, కోర్‌కమిటీ చైర్మన్ పరశురాం గోస్వామికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా దర్గా ఉరుసు ఉత్సవాలు



గంధం మహోత్సవంలో పాల్గొన్న మేడా విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన హజరత్ ఖాదర్‌వలి దర్గా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన గంధం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టంగుటూరు సర్పంచ్ షైనుద్దీన్, టంగుటూరు టీడీపీ మహిళా నాయకురాలు షర్మిల, టీడీపీ సీనియర్ నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, దర్గా కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. దర్గాకమిటీ మెంబర్లు శాలువాతో సత్కరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మేడా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మత సామరస్యానికి టంగుటూరు ఉరుసు ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెంచలయ్య, టీడీపీ నాయకులు చుక్కా యానాది, కోనాపురం ఉపసర్పంచ్ పుల్లయ్య, పాలగిరి మల్లికార్జునరెడ్డి, కొండయ్య, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు చుక్కా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇరువురు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డులో ఉన్న భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 9న దొంగలు ఆలయంలో హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. కాగా గురువారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణం



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

సంబేపల్లె, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): గుట్టపల్లి గ్రామం గుడియవాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తులు కన్నుల పండువగా జరుపుకున్నారు. అలయ నిర్మాణాలతో ప్రజల్లో భక్తి భావాలు పెంపొందుతాయని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదరి సుగవాసి ప్రసాద్‌బాబు తెలియజేశారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమనీయం... సీతారాముల కల్యాణం

సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొంత మంది దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి నిండు నూరేళ్లు ఈ ప్రాంతం సుఖశాంతులతో ఉండాలని ప్రార్థనలు చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

వీరబల్లి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): పోలీసు బందోబస్తు నడుమ గురువారం వంగిమళ్ల పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో మస్తాన్‌వలి సర్పంచ్‌పై విచారణ చేపట్టారు. గ్రామంలో పనులు చేయకుండానే లక్షల్లో గ్రామ పంచాయతీ నిధులను గ్రామ సర్పంచ్ ఎటువంటి సంతకాలు, ఓచర్లు లేకుండా 2022 నుంచి దుర్వినియోగం చేశారంటూ ఈ నెల 9న కలెక్టర్‌కు గ్రీవెన్స్‌సెల్‌లో ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు భారీ పోలీసు బందోబస్తు మధ్య గ్రామ సచివాలయంలో రాజంపేట డీఎల్‌పీవో మస్తాన్‌వలి విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా గ్రామ సచివాలయం వద్ద రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తు చేపట్టారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన ఉండాలి

\- తహసీల్దార్ భాగ్యలత



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

గాలివీడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నిర్వహణపై ప్రజలకు అవగాహన ఉండాలని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. గురువారం స్థానిక వెలిగల్లు జలాశయంలో ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో విపత్తుల సన్నద్ధ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు, విద్యార్థులు, అధికారులు తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, అధిక గాలులు, తుఫానులు వంటి విపత్కర పరిస్థితుల వల్ల జలాశయంలో నీటి మట్టం పెరగడం, తీరం వెంబడి తుఫాను ప్రభావంతో విపత్తులు ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలిగల్లు ప్రాజెక్టు అధికారులు ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ భాస్కర్‌బాబు, ఏఈ సాంబశివుడు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన మేళా పోస్టర్స్ ఆవిష్కరణ

సంబేపల్లె, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కలామ్స్ విజన్-2024 సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోస్టర్లను ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్, సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి విడుదల చేశారు. విద్యార్థినీ, విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని వెలికితీసి ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబరు 27, 28వ తేదీల్లో రెండు రోజుల పాటు రాయచోటిలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో తమ ప్రాజెక్టులను ప్రదర్శించే విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పఠాన్ మహబూబ్‌బాషా, రికార్డ్ అసిస్టెంట్ జాకీర్ బాషా, నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడికి జ్యోతిష్య శిరోమణి అవార్డు



అవార్డు అందుకుంటున్న దృశ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాండవ్యనది ఒడ్డున వెలసిన పాతరాయచోటిలోని ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మంజునాథ స్వామి గౌరవ జ్యోతిష్య శిరోమణి అవార్డును అందుకున్నారు. గత రెండు రోజులుగా తిరుపతి నగరంలో జరిగిన ఎస్ఎస్ ఆస్ట్రాలజీ లైవ్ ప్రోగ్రాంలో భాగంగా జరిగిన జ్యోతిష్య పండితుల సమ్మేళన కార్యక్రమంలో ఈయన ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఇందుకు గానూ ప్రముఖ జ్యోతిష్య పండితుడు నరసింహస్వామి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు జ్యోతిష్య పండితులు అభినందించారు.

వృద్ధాశ్రమానికి వాటర్ ఫిల్టర్ వితరణ



ఫిల్టర్‌ను అందిస్తున్న నాగేంద్ర

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఆంజనేయపురం సమీపంలో ఉన్న రాస్ వృద్ధాశ్రమానికి రైల్వేకోడూరు బృందావన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇరగబోయిన నాగేంద్ర గురువారం ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాశ్రమానికి తమవంతు సాయంగా తమ బృందావన్ ట్రస్ట్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మాదా రాజేష్, భూమా సాయిప్రతాప్‌రెడ్డి, ముప్పాల శివకుమార్‌రాజు, షేక్ మౌల, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పార్థసారథికి సేవారత్న పురస్కారం




పురస్కారం అందుకుంటున్న దృశ్యం

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సేవాసంఘం ఆధ్వర్యంలో గురువారం రాజంపేట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో రైల్వేకోడూరు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథికి అన్నమయ్య సేవారత్న పురస్కారం అందజేశారు. ప్రముఖులు అతికారి కృష్ణ, రమేష్‌నాయుడు, పుల్లంపేట మండల విద్యాశాఖాధికారుల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కె.పార్థసారధి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన సుబ్బనరసారెడ్డి, అహ్మద్ బృందం నిత్యం ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న సంస్థలను గుర్తించి గౌరవించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

సిద్దవటం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. మాధవరం-1 గ్రామం బంగారుపేటకు చెందిన కుచేలయ్యకు రూ.30 వేలు, సిద్దవటం గ్రామానికి చెందిన ఎం.సునీతకు రూ.30 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యం చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుగవాసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. కాగా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, ఓబులేశు పాల్గొన్నారు.

ఆయన సేవలు ఆదర్శం



ఆయన అందరిలాగే సాధారణ ఉపాధ్యాయుడు. అయితే తాను పనిచేసే పాఠశాలపై ఆయన చూసే శ్రద్ధ అసాధారణం. అధ్వాన్నంగా ఉన్న పాఠశాల పరిసరాలతో పిల్లల బోధనకు ఆటంకం కలుగుతుందని భావించి సొంత నిధులతో వాటి అభివృద్ధికి నడుం బిగించారు. పలు పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ముత్తుమల రామక్రిష్ణారెడ్డి.

- సొంత నిధులు, దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి
- ఎక్కడ పనిచేస్తే అక్కడ.. ఆధునిక సౌకర్యాల కల్పన
- పరిసరాలను సుందరంగా చేయడం..
- విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా విధులు
- పలువురిచే ప్రశంసలు అందుకుంటున్న రామక్రిష్ణారెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం పెండ్లిమర్రి పంచాయతీ సమితి పాఠశాల ఉపాధ్యాయుడుగా రామక్రిష్ణారెడ్డి 1984లో బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల నిండా విద్యార్థులున్నా గ్రామం దాటి బయట ప్రదేశం చూసినవారు లేరు. దీంతో ఆయన విద్యార్థులను గిద్దలూరు నుంచి రైలులో మహానంది క్షేత్రానికి తీసుకువెళ్లారు. వారిలో మానసిక వికాసంతోపాటు ఆనందం నింపారు. అక్కడ నుంచి ఆయన సుంకేసుల పల్లె, గురప్పగారిపల్లె, బూరుగమానుపల్లె, రామేశ్వరం, ముదిరెడ్డిపల్లె, కలసపాడు తదితర పాఠశాలల్లో పనిచేశారు. అక్కడ పాఠశాలల్లో అధ్వాన్నంగా ఉన్న పరిసరాలు విద్యార్థుల బోధనకు ఆటంకంగా మారుతున్నాయని గ్రహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేశారు. సొంతనిధులు, దాతల సహకారంతో పలు పాఠశాలలను అభివృద్ధి చేశారు.

2014 సంవత్సరంలో కలసపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా బదిలీ అయ్యారు. పది మంది విద్యార్థులతో అధ్వానంగా ఉన్న పరిసరాలు, పాడుబడ్డ బడి ఆయనకు స్వాగతం పలికాయి. వెంటనే ఆయన విద్యాశాఖ అధికారుల అనుమతితో పాడుబడ్డ భవనాలు తొలగించి రూ.8 లక్షల తన సొంత నిధులను ఖర్చు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. మరో రూ.5లక్షలు గ్రామస్తులు ఆయనకు విరాళం అందించి సహకరించారు. వంట గది, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు, డాక్టర్ సర్వేపల్లె రాధాక్రిష్ణ, ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాల ఏర్పాటు, ప్రతి తరగతి గదిలో గోడలకు చిత్రాలు, విద్యుద్దీకరణ, కంప్యూటరు ఏర్పాటు, ఉద్యానవనం ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్యను 110 వరకు చేశారు.

విహార కేంద్రంగా పాఠశాలలు

రామక్రిష్ణారెడ్డి అభివృద్ధి చేసిన కలసపాడు, రామేశ్వరం పాఠశాలలు ఉద్యాన మరియు విహార కేంద్రాలుగా మారాయి. ఆయన పాఠశాలలను తీర్చిదిద్దిన విధానం చూసి చుట్టుపక్కల పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు రాష్ట్ర విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం సందర్శిస్తూ ఉండేవారు. ఆయన చేసిన అభివృద్ధిపై జిల్లా, రాష్ట్రస్థాయి విద్యాశకటాలుగా మరియు తిరుపతిలో రాష్ట్రస్థాయి విద్యాస్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ సంధ్యారాణి, భాస్కర్‌రావు, పలువురు ఆర్జేడీలు, డీఈవోలు ఆయన చేసిన అభివృద్ధి చూసి ప్రశంసలు కురిపించారు.



ఆకట్టుకుంటున్న టీఎల్ఎం

రామక్రిష్ణారెడ్డి పనిచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఆయన ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) విద్యార్థులకు ఎంతగానో ఉపయోడపడుతోంది. తరగతి గదుల నిండా దేశ నాయకుల చిత్రాలు, వారి వివరాలు చదువును శులభంగా నేర్చుకునేందుకు ఉపయోగపడుతోంది. తరగతి గదుల గోడల నిండా ఇలాంటి వాటితో నింపారు. దాంతో విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెరుగుతోంది.

పలు పురస్కారాలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ముత్తుమల రామక్రిష్ణారెడ్డి ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల నుంచి పలు పురస్కారాలు అందుకున్నారు. 2009లో ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయ అవార్డు, 2010లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2012లో అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి చందనాఖాన్ చేతుల మీదుగా సక్సెస్ స్టోరీ ఆఫ్ రామేశ్వరం అవార్డు, 2013లో అప్పటి విద్యాశాఖమంత్రి పార్థసారధి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2014లో మదర్‌తెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారిచే గురు బ్రహ్మ అవార్డు, 2019లో అప్పటి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహ్మద్‌ఆలీ చేతుల మీదుగా జాతీయ స్థాయి ఆవిష్కార్ అవార్డు, 2024లో వ్యాస మహర్షి పురస్కారం అందుకున్నారు.

పాఠశాలలే దేవాలయాలు

పాఠశాలలను దేవాలయాలుగా భావించి అంకితభావంతో పనిచేశాను. పిల్లల భవిష్యత్తు కోసం దాతల సహకారం, నా సొంత నిధులతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేశాను. అందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రోత్సహించి నన్ను ముందుకు నడిపారు. ప్రతి పేదబిడ్డ పాఠశాలలో ఏ లోటు రాకుండా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానం పొందాలన్నదే నా ఆశయం.

- ముత్తుమల రామక్రిష్ణారెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, రామేశ్వరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల



ఉద్యానవనాన్ని తలపిస్తున్న రామేశ్వరం పాఠశాల

సుందరంగా రామేశ్వరం, కలసపాడు పాఠశాలలు

జిల్లా సరిహద్దులో పోరుమామిళ్ల మండల పరిధిలో ఉన్న రామేశ్వరం మారుమూలపల్లె. అక్కడ పాఠశాలలో రామక్రిష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టే నాటికి అధ్వాన్నంగా ఉన్న పరిసరాలు, అంతంత మాత్రం పిల్లల హాజరు ఉండేది. దీనిని చూసి మనసు చలించిన ఆయన 2005-13 సంవత్సరాల మధ్య తన సొంత నిధులు రూ.2లక్షలు పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశారు. చుట్టూ ప్రహరీగోడ, బండపరువు, ఉద్యానవనంగా తోట, పూలమొక్కలు, దేశ నాయకుల చిత్రపటాలు, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయించారు. ఆయన చేస్తున్న పనులు చూసి గ్రామస్తులు లక్షా 46వేల రూపాయలు అందించారు. ప్రస్తుతం ఆయన మరో దఫా రామేశ్వరం పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడుగా కొనసాగుతూ మరో రెండు లక్షల రూపాయల వరకు పాఠశాలకు ఖర్చు చేశారు.



కలసపాడు ప్రాథమిక పాఠశాలలో రామక్రిష్ణారెడ్డి ఏర్పాటు చేసిన సూక్తుల బోర్డులు, గోడలకు ప్రముఖుల చిత్రాలు

జీవో 145ను రద్దు చేయండి

● కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన ● జేసీకి వినతిపత్రం అందజేత



జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఉన్న ఫస్ట్ ఏడీజే కోర్టుల్లో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం జరగాల్సిన క్రిమినల్ కేసులు జరిగే అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చేయాలని రాయచోటి న్యాయవాదులు గురువారం రెండవరోజు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కలిసి జీవో రద్దుకు తాము చేస్తున్న ఆందోళనను ప్రభుత్వానికి వివరించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో 145 వలన రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కూడా భవిష్యత్తులో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తాన్ని తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉంటుందని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఎన్‌డీపీఎస్ కేసులు కేవలం నాలుగు ప్రాంతాల్లో మాత్రమే ట్రైల్ జరిగే అవకాశం ఉందని దీనివలన కక్షిదారులు ప్రతి వాయిదాకు సుదూర ప్రాంతానికి ప్రయాణం చేసి కోర్టులకు హాజరు కావాల్సి వస్తుందన్నారు. ప్రజల ముంగిట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి కావాలని, దేశ అత్యున్నత న్యాయస్థానం ఎంత చెబుతున్నా ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా న్యాయ వ్యవస్థను ప్రజలకు దూరం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు టీ.ఈశ్వర్, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్‌రాజు, ధనుంజయ్‌కుమార్, చిన్నయ్య, రామాంజులు, మిఠాయి ఖాదర్‌బాషా, వరలక్ష్మి, జూనియర్ ఆనంద్, ఉత్తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఆర్‌సీకి అధికారుల హాజరు



మహిళా సమాఖ్య భవనంలోని జీఆర్‌సీ సెంటర్‌లో హాజరైన అధికారులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వేధింపులు, సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మదనపల్లెలో ఏర్పాటు చేసిన జెండర్ రీసోర్సు సెంటర్(జీఆర్‌సీ)కు అధికారుల గైర్హాజరుపై ఆంధ్రజ్యోతిలో గత శుక్రవారం 'కమిటీ సభ్యులెక్కడ' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ప్రతి గురువారం జీఆర్‌సీలో కమిటీ సభ్యులైన ఎంపీడీవో, సీడీపీవో, ఎస్‌ఐ, ఏపీఎం, మహిళా సమాఖ్య లీడర్లు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు హాజరు కావాలి. కానీ మదనపల్లెలో జీఆర్‌సీ ప్రారంభించిన తరువాత రెండు గురువారాలు అధికారులు, కమిటీ సభ్యులు హాజరు కాలేదు. దీనిపై గత గురువారం పరిశీలించిన ఆంధ్రజ్యోతి వార్త ప్రచురించింది. ఈ విషయమై కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ జీఆర్‌సీ సెంటర్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్ర మంలో మూడో గురువారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జీఆర్‌సీలో కమిటీ సభ్యులైన ఎంపీడీవో తాజ్‌మస్రూర్, సీడీపీవో సుజాత, ఎస్‌ఐ హరిహరప్రసాద్, ఏపీఎం సుబ్రమణ్యం, మహిళా సమాఖ్య లీడర్లు హాజరయ్యారు. జీఆర్‌సీని బలోపేతం చేసి మహిళలపై వేధింపులు, గృహహింస, లైంగిక వేధింపులు తదితర సమస్యలను ఇక్కడే ఫిర్యాదు చేసేలా, వాటిని ఇక్కడే పరిష్కరించేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

కూటమి ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల తాళాల పంపిణీలో ఎమ్మెల్యే



లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజ

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణాల్లోని నిరుపేదలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమే న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రగన్నమిట్ట వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు రద్దు చేసి, కాలయాపన చేసిందన్నారు. టిడ్కో ఇళ్ల కోసం డీడీలు చెల్లించిన ప్రజలు ఐదేళ్లు ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టి ఆరునెలల కాలంలోనే టిడ్కో ఇళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మొత్తం 39 బ్లాకుల్లో నిర్మించిన 1872 ఇళ్ల తాళాలను ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, కమిషనర్ ప్రమీల, మాజీ కౌన్సిలర్లు రాధ, లక్ష్మిదేవి, టీడీపీ నాయకులు రాటకొండ భారతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతి?

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై మృతుడి బంధువుల ఆరోపణలు

రాజంపేటటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నవోదయ కాలనీకి చెందిన రాజశేఖర్ (37) మృతి చెందిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఆకేపాడు నవోదయ కాలనీకి చెందిన రాజశేఖర్ వ్యక్తిగత కారణాల వల్ల బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం నుంచి గురువారం వరకు అతనికి వైద్యసేవలు ఆసుపత్రిలోనే అందజేశారు. అయితే గురువారం మధ్యాహ్నం రాజశేఖర్‌కు ఉన్నట్లుండి సీరియస్ కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు వెళ్లాలని వైద్యులు చేతులెత్తేసినట్లు వారి బంధువులు తెలిపారు. కడప రిమ్స్‌కు తరలిస్తుండగా రాజశేఖర్ మృతి చెందాడు. ఈ విషయమై వారి బంధువులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజశేఖర్ ఆసుపత్రికి చేరిన వెంటనే మెరుగైన వైద్య చికిత్స కోసం వేరే ఆసుపత్రికి తరలించాలని తమకు చెప్పలేదని, ఇక్కడే బాగు చేస్తామని చెప్పడంతో తాము ఏమీ చేయలేకపోయామని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని అతడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌ను వివరణ కోరగా పురుగుల మందు తాగిన రాజశేఖర్‌కు అన్నివిధాల వైద్య చికిత్సలు చేశామని, ఇందులో డాక్టర్ తప్పు లేదని, మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు వారి బంధువులు తరలిస్తుండగా చనిపోయినట్లు వారి బంధువుల ద్వారా తెలిసిందన్నారు. ఇదే విషయమై మన్నూరు సీఐ మహ్మద్‌అలీని వివరణ కోరగా.. ఈ విషయంపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

నామినేటెడ్ పదవులపై కసరత్తు

- జిల్లాలో మార్కెట్ కమిటీల్లో 150 మందికి ..
- సింగిల్ విండోల్లో 90 మందికి అవకాశం
- కసరత్తు చేస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు

కలికిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రధాన నాయకులు, క్రియాశీలక కార్యకర్తలకు మండల, నియోజకవర్గ స్థాయిల్లో పదవులు కట్టబెట్టడానికి కసరత్తు జరుగుతోంది. ప్రధానంగా మార్కెట్ కమిటీలు, సింగిల్ విండోల్లో పదవులను భర్తీ చేయడానికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీకి చెందిన ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు దీనికోసం పెద్ద ఎత్తున కసరత్తు చేపట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 10 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో మొత్తం 150 మందిని నియమించే అవకాశముంది. అదేవిధంగా 30 సింగిల్‌విండోల్లో ఒక్కో దానికి చైర్మన్‌తో సహా ముగ్గురు ప్రకారం మొత్తం 90 మందితో పర్సన్ ఇన్‌చార్జుల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గాల్లోని కొంతమంది ప్రధాన క్రియాశీలక నాయకులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లలో డైరెక్టర్లుగా నియామకాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇంకా కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్‌లను, డైరెక్టర్లను నియమించేందుకు టీడీపీ అధిష్ఠానం ప్రక్రియను కొనసాగిస్తోంది. ఈ స్థాయిలో పదవులు పొందలేని వారికి నియోజకవర్గ స్థాయిలో సముచిత ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన కారణంగానే మార్కెట్ కమిటీలు, సింగిల్ విండోల్లో నియామకాలు ఆలస్యమవుతున్నట్లు కూడా చెబుతున్నారు.



మార్కెట్ కమిటీ పదవులకు రిజర్వేషన్లు

జిల్లాలో ప్రస్తుతం మొత్తం 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. 2019 డిసెంబరు 12న ప్రకటించిన 120 జీవోతో అప్పటి ప్రభుత్వం మార్కెట్ కమిటీల పరిధులను పునర్వ్యస్థీకరించింది. కొన్ని మండలాలను అటూ ఇటూ మార్చి సర్దుబాటు చేశారు. ఈ సందర్భంలోనే వాల్మీకిపురం ఏఎంసీని విడగొట్టి కలికిరి, కలకడ మండలాలకు కలిపి కలికిరి ఏఎంసీని కొత్తగా ప్రకటించారు. అదే ఏడాది మార్కెట్ కమిటీల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లను కూడా అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. ఆ తరువాత 2020-22 కాలానికి రెండేళ్ల గడువుతో నామినేటెడ్ కమిటీలను ప్రకటించారు. ఈ గడువు పూర్తయిన అనంతరం రెండో విడతగా కొన్ని కమిటీలను యథాతథంగా మరో రెండేళ్లు కొనసాగించడమో లేక తరువాత రెండేళ్ల కాలానికి కొత్త కమిటీలను నామినేట్ చేయడమో జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ కమిటీలన్నీ రద్దయ్యాయి. తాజాగా ఇప్పుడు కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్లతోనే కమిటీల నియామకం చేపట్టాలని మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ విధానాన్నే ఇప్పుడు కూడా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు స్పష్టత వచ్చింది. రిజర్వేషన్లు మొదటిసారిగా అమల్లోకి వచ్చిన తరువాత రెండు పర్యాయాలు కమిటీల నియామకాలు జరిగాయి. రెండో పర్యాయం ఏర్పాటైన కమిటీలకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ నామినేటెడ్ సభ్యులను భర్తీ చేశారు. ఇప్పుడు కూడా ఇదే రోస్టర్ విధానాన్నే కొనసాగించనున్నట్లు చెబుతున్నారు. అంటే జిల్లాలోని 10 మార్కెట్ కమిటీలు ఈ ఏడాది రద్దయ్యేనాటికి రెండోసారి రోస్టర్ విధానంలో రిజర్వేషన్లు ఇలా కొనసాగాయి. రాజంపేట మార్కెట్ కమిటీ ఓసీ (మహిళ), రైల్వేకోడూరు కమిటీ ఓసీ (జనరల్), రాయచోటి బీసీ (జనరల్), లక్కిరెడ్డిపల్లె ఓసీ (జనరల్), మదనపల్లె ఓసీ (జనరల్), పీలేరు బీసీ (జనరల్), కలికిరి ఎస్సీ (మహిళ), వాల్మీకిపురం ఎస్టీ (మహిళ), తంబళ్ళపల్లె (ములకలచెరువు) బీసీ (మహిళ), బి.కొత్తకోట (అంగళ్లు) ఓసీ (మహిళ).

అన్ని పదవుల్లోనూ మహిళలకు 50 శాతం

జిల్లాలోని పది మార్కెట్ కమిటీల్లో ఒక్కో దానికి చైర్మన్, వైస్ చైర్మన్‌లతో కలిపి వివిధ కేటగిరీల్లోనుంచి 15 మందిని నామినేట్ చేయాల్సి ఉంది. వీరు కాకుండా ప్రతి కమిటీకి సంబంధిత ఎమ్మెల్యే గౌరవాధ్యక్షుడిగా, సింగిల్ విండో అధ్యక్షుడు సభ్యుడిగా నియామకవుతారు. రిజర్వేషన్లను కేటాయించడానికి జిల్లాను యూనిట్‌గా పరిగణిస్తారు. ఈ ప్రక్రియ ప్రకారం జిల్లాలోని 10 ఏఎంసీల్లో ఐదింటికి తప్పనిసరిగా మహిళా చైర్మన్లను నియమించాల్సి ఉంది. ఇక ప్రతి కమిటీ సభ్యుల్లో సైతం 50 శాతం డైరెక్టర్ పదవులు మహిళలకే దక్కుతాయి. అంటే ప్రతి కమిటీలోనూ ఏడు లేక 8 మంది మహిళలను నియమించనున్నారు. అదేవిధంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కులాల వారీగా 50 శాతం కమిటీలు అంటే జిల్లాలో 5 కమిటీలు రిజర్వ్ కానున్నాయి. మిగతా ఐదు కమిటీలు ఇతరులకు కేటాయిస్తారు. యాభై శాతం రిజర్వేషన్లలో బీసీ, మైనారిటీలకు కలిపి 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం చైర్మన్, డైరెక్టరు పదవులు కేటాయించనున్నారు. తాజా నియామకాల్లో పాటించే రోస్టర్ విధానంలో రెండో రోస్టర్ (2022-24)లో జరిగిన కేటాయింపులు పూర్తిగా మారిపోనున్నాయి. ఇందులో కలికిరి మార్కెట్ కమిటీకి రెండో రోస్టర్‌నే పాటించాల్సి ఉందని చెబుతున్నారు. 2020-22 మొదటి విడతలో కలికిరి ఏఎంసీ చైర్మన్ పదవిని ఓసీ జనరల్‌కు కేటాయించారు. రెండో విడత 2022-24లో కలికిరి ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించారు. అయితే రెండో విడతలో ఎస్సీ మహిళ నియామకం జరపకుండానే గడువు పూర్తయ్యింది. దీంతో రోస్టర్ విధానం కొనసాగాల్సి ఉన్నందువల్ల కలికిరి చైర్మన్ పదవిని మూడో రోస్టర్ (2024-25)లో యథాతథంగా ఎస్సీ మహిళకే కేటాయించాల్సి ఉంది. దీంతో జిల్లా స్థాయిలో కూడా మూడో రోస్టర్‌లో మరిన్ని మార్పులు చోటు చేసుకోనున్నాయని తెలుస్తోంది.

కాటేజి పనులు వెంటనే పూర్తి చేయాలి

● టూరిజం సీఈ నరసింహారావు

బి.కొత్తకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో జరుగుతున్న ఏపీ టూరిజం కాటేజీల ఆధునికీకరణ, మరమ్మతు పనులు ఈనెలాఖరుకు వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీ టూరిజం సీఈ వీవీఎల్ నరసింహారావు మేనేజర్ సాల్విన్‌రెడ్డిని ఆదేశించారు. గురువారం ఆయన ఈఈ సుబ్రమణ్యం, డీఈ శ్రీనివాస్‌లతో కలిసి హార్సిలీ హిల్స్‌ను సందర్శించారు. హిల్స్‌పై ఏపీ టూరిజం నిధులతో కాటేజీలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎక్కడా పొరబాట్లు జరగకుండా చూడాలని స్థానిక టూరిజం మేనేజర్‌ను ఆదేశించారు. ఎన్ని కాటేజీలలో పనులు జరుగుతున్నాయి, ఆ పనుల కోసం వెచ్చిస్తున్న నిధుల గురించి అధికారులకు మేనేజర్ వివరించారు.



హార్సిలీహిల్స్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

డ్యూటీలకు డుమ్మా కొడితే సెలవే

● ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమలు
● జిల్లా ఖజానాశాఖలో ప్రక్షాళన



జిల్లా ఖజానా శాఖ కార్యాలయం

కడప కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆ శాఖ జిల్లా ఆర్థిక వ్యవరాలను చక్కబెట్టే కీలకశాఖ. 20 వేల మంది ఉద్యోగులు, మరో 19వేల మంది పెన్షనర్లకు సంబంధించి జీతబత్యాలు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. సంక్షేమం అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.120 కోట్ల వరకు నెలనెలా చెల్లింపులు ఉంటాయి. అలాగే ప్రభుత్వానికి కూడా జిల్లా వ్యాప్తంగా పన్నుల చెల్లింపుల రూపంలో రూ.150 కోట్లు వరకు ఖజానాకు జమ అవుతుంది. ఇంతటి కీలక శాఖలో ఉద్యోగులు విధులకు ఎప్పుడు వస్తారో.. అసలు వస్తారో రారో తెలియని పరిస్థితి. తరచూ వీళ్ల విధులకు డుమ్మాలు కొట్టడంలో ఆరితేరారనే విమర్శలు ఉన్నాయి. అయితే నెలనెల లక్షల్లో జీతాలు తీసుకోవడంలో సిద్ధహస్తులని చెబుతున్నారు. వీరి వ్యవహారశైలిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఖజానాశాఖ రాష్ట్ర డైరెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టాల్సిన ఎస్టీఓలు, సిబ్బంది పనిచేసే కార్యాలయాల్లో ఉండకపోవడంపై జిల్లా డిప్యూటీ డైరెక్టర్లకు తలంటి.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగులు, పెన్షనర్లకు జవాబు దారీతనంగా పనిచేసి ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాల్సిన ఉద్యోగులు గాడి తప్ప డం పై ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్) అమలుకు శ్రీకారం చుట్టారు. విధులకు డుమ్మా కొట్టే ఉద్యోగులు, సిబ్బంది తాము పని చేసే కార్యాలయాలకు వచ్చి ఎఫ్‌ఆర్‌సీ వేస్తే సరి.. లేకపోతే వాళ్లకు సెలవు ఖాయంగా మారడంతో కొందరి ఉద్యోగులు జీర్ణించుకోలేక పోతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా...

ఖజానా శాఖలో ఉండి ఉద్యోగాలు వెలగబెట్టాల్సిన కొందరు ఎస్టీఓలు (సబ్ ట్రజరీ ఆఫీసర్లు) సీఎఫ్ఎంఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా మారారనే విమర్శలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల తరహాలోనే ల్యాప్‌ట్యాపులను సంకన పెట్టుకొని వర్క్‌ఫ్రం హోం పద్దతిలో ఇన్నాళ్లు ఇళ్ల వద్దనే సీఎఫ్ఎంఎస్ బిల్లులను, ఆఫీసు వ్యవహారాలను చక్కబెట్టే వారు. దీంతో జిల్లా కార్యాలయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సందేహాలు చెప్పే నాధుడే కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ప్రముఖులకు సంబం ధించిన ఇరువురు ఎస్టీవోలు డ్యూటీలకు డమ్మాలు కొట్టినా అధికారి పట్టించుకునేవాడు కాదనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాదు ఉద్యో గులు జిల్లా కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించిన తమ అరియర్స్, పెన్షన్లు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్సుమెంట్ లాంటి ఆర్థిక వ్యవహారాలకు చెందిన ఫైళ్ల ఏదశలో ఉన్నాయో తెలుసుకోవాలంటే సగటు ఉద్యోగికి తలనొప్పిగా మారింది. ఇపుడు రాష్ట్ర ఆర్థికశాఖ డైరెక్టర్ నిఘా పెట్టడంతో వీరి ఆటలకు చెక్ పడినట్లయ్యింది.

ఎఫ్‌ఆర్‌ఎస్‌కు టోకరా?

ఖజానాశాఖ ఉద్యోగులకు ఎన్ని ఆంక్షలు పెట్టినా.. వాటిని తమకు అనుకూలంగా మార్చు కోవడంలో దిట్టలంటున్నారు. ఉద్యో గులు జవాబుదారీతనంగా కార్యాలయాల్లో పని చేసేలా ఫేస్ రికగ్నేషన్ సిస్టంను ప్రభుత్వం తెస్తే దానిని కూడా కొందరు అనుకూలంగా మార్చు కుంటున్నారని సహ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కొందరు ఆఫీసు పనుల సాకుతో ఎఫ్ ఆర్ఎస్ వేసుకొని ఎంచక్కా తమ సొంత పనులు చేసు కుంటూ.. మళ్లీ సాయంత్రం వేళల్లో ఏదో ఒక సమయంలో.. అదే లొకేషన్‌కు వచ్చి ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకుంటూ టోకరా కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరి కొందరు ఎస్టీవోలు ఎంక్వైరీల పేరుతో ఎక్కడో ఏదో ఒక ఊరిలో ఉండి అక్కడ నుంచి టూర్ అనే ఆప్షన్ ద్వారా హాజరు వేసుకుంటూ విధులకు డుమ్మాలు కొడుతున్నట్లు సమాచారం.

సీనియర్ల స్థానంలో జూనియర్లకు పెద్ద పీట

సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లుతున్న సమయంలో జీత భత్యాలు, పెన్షన్లు సీఎఫ్ఎంఎస్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో జరిగే ఈ రోజుల్లో ఆర్థికశాఖ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులకు కాసులు కురిపిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. గతంలో బిల్లుబిల్లుకు ఎంతో కొంత సమర్పించుకుంటేనే ట్రెజరీలో పాస్ అయ్యేవని ఆశాఖకు పెద్ద మచ్చే ఉండేది. కానీ ఇపుడు కూడా ఏడాది కాలంగా పెండింగ్‌లో పడిన అరియర్స్, ఇతరత్రా పెండింగ్ బిల్లులు చేయా లంటే లంచం ఇస్తేనే బిల్లులు పాస్ అన్నట్లుగా సాగుతోందనేది నగ్న సత్యం.

ఈ విషయాలపై జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లను వివరణ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం ఖజానాశాఖ ఉద్యోగులు కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తించేలా ఫేస్ రికగ్నేషన్ సిస్టం అమలు చేస్తోంది. పనిచేసే కార్యాలయాల పరిధిలోనే వాళ్ల ఉదయం-సాయంత్రం ఎఫ్‌ఆర్‌ఎస్ వేయాల్సి ఉంటుంది. వాళ్ల కార్యాలయాల్లో ఉన్నారా లేదా అనే విషయాలను పరిశీలించడం జరుగుతోంది. కొందరు ఉద్యోగులు పాత పద్ధతిలో ఉన్నారు. లంచాలు తీసుకుంటున్నట్లు, బిల్లుల పాస్‌కు పైసలు అడిగినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వేపరాల విద్యార్థులు



వెంకట హరిణి, సుప్రజ

మైలవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో భారతీయ విజ్ఞాన మండలి నిర్వహించే కౌశల్ క్విజ్ పోటీలకు వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెంకటహరిణి, సుప్రజ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలయ్య తెలిపారు. వీరు ఈనెల 30వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు పాఠశాల కోఆర్డినేటర్‌గా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నరసింహులు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

15న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 7-30 గంటలకు అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ప్రధానంగా ఎంపికలకు వచ్చే వారు తమ ఆధార్‌కార్డు కాపీ, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్, (ఫారమ్-5) పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, ఒరిజినల్‌తో పాటు తమ కిట్ బ్యాగ్‌లు కూడా వెంట తీసుకురావాలని సూచించారు.

రైల్వే ఎన్నికల్లో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ విజయం



విజయోత్సవంలో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ నేతలు

కొండాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధి కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ విజయం సాధించినట్లు కడప బ్రాంచి అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి ఈశ్వరయ్య తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. కాగా గురువారం గుంతకల్లులో కౌంటింగ్ జరిగినట్లు వారు తెలిపారు. తమ సంఘం విజయం సాధించడంపై వారు కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యానుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి



శివశంకర్ మృతదేహం

రామాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన సానే శివశంకర్(30) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... సానే శివశంకర్‌కు రెండేళ్ల క్రితం కడపలో నివాసముంటున్న తన అక్క కూతురు రోహిణితో వివాహమైంది. వీరికి ఇంతవరకు పిల్లలు లేరు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ.. తరచూ మద్యం సేవించేవాడు. రోజు మాదిరే బుధవారం రాత్రి కూడా తాగి రావడంతో అతని తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన శివశంకర్ జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయాడు. పొద్దుపోయాక అతని తండ్రి గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి



కొండాపురం, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగడిపల్లె రైల్వే స్టేషన్‌లో గురువారం రైలుకింద పడి చప్పిడి రేణుకా రెడ్డి (54) అనే వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు తిరుపతి-హుబ్లీ ప్యాసింజర్ రైలుకింద పడి చనిపోయాడు. ఇతను రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డడా లేదా రైలు ఎక్కుతూ కింద పడ్డాడా మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో విచారిస్తున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇతను ఆర్టీ పీపీ కేవిరెడ్డి నగర్‌కు చెందినవాడిగా గుర్తించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

సింహాద్రిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వై.కొత్తపల్లి గ్రామంలో గురవారం రోడ్డు ప్రమాదంలో కొక్కంటి. రామసుబ్బారెడ్డి(73) అనే వృద్ధుడు మృతి చెందాడు. సింహాద్రిపురం ఎస్ఐ తులసి నాగప్రసాద్ సమాచారం మేరకు రామసుబ్బారెడ్డి ఉదయాన్నే తన టీవీఎస్ బైక్‌పై పొలం వద్దకు వెలుతుండగా ఎదురుగా బొలేరా వాహనం వచ్చి ఢీకొట్టింది. దీంతో రామసుబ్బారెడ్డి అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారులు కలరు. మృతుని మనువడు సందీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతులు లేని బోటు సీజ్

జమ్మలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న బోటును ఇరిగేషన్‌శాఖ అధికారులు సీజ్ చేశారు. గురువారం గండికోట సర్పంచ్ కొంత మంది పర్యాటకులతో అనుమతి లేకుండా బోటు షికారు చేయిస్తున్నట్లు సమాచారం రావడంతో మైలవరం ఇరిగేషన్‌శాఖ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. జలాశయంలో ఎవరైనా అనుమతి లేకుండా బోటు నడిపితే చర్యలు తప్పవన్నారు. బోటు షికారుకు అనుమతులు తప్పనిసరి అని ఏఈ తెలిపారు.

వర్షానికి కూలిన చింతచెట్టు... తప్పిన ప్రమాదం



పుల్లంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై హైవేపక్కనే ఉన్న పెద్ద చింత చెట్టు జడివానకు కూలిపోయింది. దీంతో ఓ ఇల్లు పూర్తిగా దెబ్బతినగా 2 విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. చెట్టు కూలిన సమయంలో రోడ్డుపైన, ధ్వంసమైన ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మండల పరిధిలోని పుత్తనవారిపల్లె వద్ద జాతీయ రహదారి పక్కనే పెద్ద చింత చెట్టు ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న జడివానకు గురువారం సాయంత్రం ఉన్నఫళంగా కూలిపోయింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలపై పడడంతో పూర్తిగా విరిగిపోయాయి. పక్కనే ఉన్న ఇల్లు కూడా పూర్తిగా దెబ్బతినింది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ లేక ప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

పోరుమామిళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతులు లేకుండా జాతీయ రహదారి పనులకు మట్టిని తరలిస్తుండగా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. చిన్నాయపల్లె రెవెన్యూ సదస్సు ముగించుకుని వస్తుండగా మట్టిని తరలిస్తున్నారన్న విషయం తెలియడంతో బుధవారం రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గురువారం కూడా మరో ప్రాంతం నుంచి రెండు టిప్పర్లు మట్టిని తరలిస్తుండగా వాటిని కూడా తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రౌన్ స్ఫూర్తితో భావితరాలకు ఆదర్శంగా నిలవాలి

● వైవీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి



బ్రౌన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్య కె.కృష్ణారెడ్డి

కడప కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విదేశీయుడైనా తెలుగుభాషా అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సీపీ బ్రౌన్ స్ఫూర్తితో యువత తెలుగుపై మక్కువ పెంచుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని వైవీయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. వైవీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని సమావేశ మందిరంలో బ్రౌన్ 141వ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత బ్రౌన్ చిత్రపటానికి అతిథులతో కలిసి పూలమాల సమర్పించి మాట్లాడారు. 19వ శతాబ్దంలో సీపీ బ్రౌన్ అంత గొప్పగా శ్రమించకుంటే తెలుగు భాషా సాహిత్యం అధోగతి పాలయ్యేదన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని విదేశీయులకు చాటిచెప్పాడన్నారు. ఇవాళ తెలుగు భాషా సాహిత్యం ఇంతగా వెలుగొందడానికి కారణభూతుడు బ్రౌన్ అని కొనియాడారు. వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాధరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో తెలుగు కావ్యాలను పరిష్కరింపచేసిన ఘనత సీపీ బ్రౌన్‌దే అన్నారు. అనంతరం బ్రౌన్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పద్యపఠన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి, సహాయ సంచాలకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఎం.వినోదిని, పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలి : డీపీవో



సమావేశంలో మాట్లాడతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలని.. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీలో ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా చెన్నూరులో గురువారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామాభివృద్ధికి ఎన్నో రకాల ప్రణాళికలు పంచాయతీల ద్వారా తయారు చేయడం జరిగిందన్నారు. అవన్నీ జీవనాధారంగా ఉన్నపుడు మాత్రమే జరిగిన అభివృద్ధికి సార్థకత వుంటుందన్నారు. అన్నిశాఖల అధికారులు సర్పంచులతో కలిసి ప్రజల కోసం పాటుపడాలన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆశయమన్నారు. ఇందుకోసం ప్రతీ మండలంలో రెండు రోజుల పాటు అందరికీ అవగాహనతో కూడిన శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఈఓఆర్డీ సురేష్‌బాబు, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు మల్లికార్జునరావు, ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్, సర్పంచ్‌లు చంద్రయాదవ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కార్యదర్శులు గురవేశ్వరరావు, శివకుమార్, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

● ట్రిపుల్‌ఐటీని తనిఖీ చేసిన వీసీ విజయ్‌కుమార్



ట్రిపుల్‌ఐటీలో మెస్‌ను పరిశీలించి సూచనలిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ విజయ్‌కుమార్

వేంపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ఆదేశించారు. కొద్దిరోజులుగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు కొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని పత్రికల్లో రావడంతో వీసీ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని గురువారం సందర్శించారు. మెస్‌లను తనిఖీ చేశారు. ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థులు, అధికారులతో మాట్లాడి పరిస్థితిని వాకబుచేశారు. ప్రధానంగా ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు లేకపోవడం వల్ల బయట నుంచి ఫుడ్ తెచ్చుకుంటున్నారని, పాత క్యాంపస్‌లోని ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఇక్కడి మసాలాలు పడకపోవడంతో కొంత ఇబ్బంది పరిస్థితి ఎదురైందని వీసీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, క్యాంటీన్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సండ్ర, డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ పెనుగొండ రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్యాంటీన్లను త్వరగా ఏర్పాటు చేయాలి

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సుమారు 8500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరితో పాటు అధ్యాపకులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అక్కడ గతంలో ఉన్న క్యాంటీన్లు మూతపడ్డాయి. కొత్త క్యాంటీన్లు ఏర్పాటు చేయలేదు. సుమారు రెండు నెలలకు పైగా కావస్తున్నా క్యాంటీన్లు లేకపోవడతో విద్యార్థులు బయటఫుడ్ తెప్పించుకుంటున్నారు. క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే ఇక్కడే అందుబాటులో ఉంటుందని విద్యార్థులు మొరపెట్టుకుంటున్నా అధికారులు సాత్సారం చేస్తున్నారు. ప్రధానంగా క్యాంటీన్ల ఏర్పాటు విషయంలో రాజకీయం నడుస్తోంది. వైసీపీ, టీడీపీకి చెందిన నాయకులు తమ వారికే తెప్పించుకోవాలన్న పట్టుదలతో అధికారులపై ఒత్తిడి తేవడంతో పాటు విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లారు. అయినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో క్యాంటీన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. వీటిని అధిగమించి త్వరగా క్యాంటీన్ల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులపై ఉంది.

గంగపేరూరు సాగునీటి సంఘాల ఓటరు లిస్టుపై ఫిర్యాదు



జేసీ అదితిసింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపేరూరు సాగునీటి సంఘాల ఓటరు లిస్టుపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు స్థానిక టీడీపీ నాయకులు, మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ వెంకటనరసయ్య, గంగపేరూరు ఎంపీటీసీ సుబ్బరాయుడు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం ఓటరు లిస్టును, నోటీసును బోర్డులో పెట్టిన విధంగా కాకుండా గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ చెప్పిన విధంగా ఆరు టీసీ నెంబర్ల పరిధిలో నూతనంగా దాదాపు 100 ఓట్లను చేర్చారని ఆరోపిస్తున్నారు. వీఆర్వో వైసీపీ వ్యక్తులతో కలిసి రెండు రోజుల్లో ఎన్నికలు ఉన్న సమయంలో ఇలా చేయడం ఏమిటని తహశీల్దారు రమణమ్మను ప్రశ్నించారు. వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి మంత్రి వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించి చర్యలు చేపడతామని తెలిపినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

కడపలో మజ్దూర్ యూనియన్ సంబరాలు



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు సంఘ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించింది. గురువారం కడప రైల్వేస్టేషన్‌లో మజ్దూర్ యూనియన్ నాయకులు బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. తమ యూనయన్‌ని గెలిపించిన రైల్వే ఉద్యోగులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్.మొహిద్దీన్ మృతి



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడ ప మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మాజీ రాష్ట్ర మైనార్టీ కమిషన్ మెంబర్ ఎస్ మొహిద్దీన్ అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందాడు. ఈయన 1981 నుంచి చాలా పర్యాయాలు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నిక య్యారు. అందరితో సోదరభావంతో మసలిన మొహిద్దీన్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు సంతాపం తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఈడీ



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఈడీ, యూనియన్ ప్రతినిధులు

కడప మారుతీనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కడప జోన్ పరిధిలోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రజా ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ కడప జోనల్ కమిటీ ఆధ్వర్యంలో ఈడీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ కడప జోన్ ముందు వరసలో ఉండేలా ఉద్యోగులంతా సమష్టిగా సేవలందించి లాభాలబాట పట్టించేందుకు శ్రమిద్దామన్నారు. అనంతరం ఈడీని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో యూ నియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య, జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్, కడప నాన్ ఆపరేషన్ విభాగ నాయకులు అంకిరెడ్డి, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణాలు చేపట్టరా..?

- తాత్కాలిక మరమ్మతులకే పరిమితం
- వర్షా కాలం వచ్చిందంటే భయం గుప్పిట్లో ఆయా గ్రామాల ప్రజలు
- నిధులు మంజూరయ్యాయంటున్న రోడ్లు, భవనాల శాఖ అధికారులు



బొంతవారిపల్లె వద్ద తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు



చెన్నరాయునిపల్లె పాపాఘ్ని నదిపై కొట్టుకుపోయిన బ్రిడ్జి (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :వర్షాకాలం వచ్చిందంటే చాలు కల్వర్టులు దెబ్బతిని రాకపోకలు ఎక్కడ నిలిచిపోతాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న కల్వర్టులను తాత్కాలిక మరమ్మతులకే పరిమితం చేస్తుండడంతో వాటిని శాశ్వతంగా ఎప్పుడు నిర్మిస్తారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లోని వాగులపై రహదారుల కోసం నిర్మించిన పలు కల్వర్టులు 2021 అక్టోబర్, నవంబర్ మాసాల్లో కురిసిన బారీ వర్షాలకు వరదల ఉధృతికి పూర్తిగా కొట్టుకు పోయాయి. అయితే అవి నేటికి తాత్కాలిక మరమ్మత్తులతోనే సరిపెడుతున్నారని, 4 సంవత్సరాలు కావస్తున్నా శాశ్వత కల్వర్టుల నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షాలు వస్తే తమ గ్రామాలకు వెళ్లే వీలు లేకుండా పోతోందని గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయి తీవ్రఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని వాపోతున్నారు. టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలో పాపాఘ్ని నదిపై ఉన్న కల్వర్టు ఇదే పంచాయతీ జంబుగానిపల్లె వద్ద ఉన్న కల్వర్టు, రంగసముద్రం పంచాయతీ బొంతవారిపల్లె వద్ద ఉన్న కల్వర్టులు వరదల ఉధృతికి తెగిపోయాయి. అప్పట్లో 2 నెలల పాటు పరిసర గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అటు తరువాత కొన్ని రోజులకు తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాక పోకలు పునరుద్ధరించారు. కాగా 2022జూన్, జూలై మాసాల్లో, అక్టోబర్, నవంబర్ మాసాల్లో మరొక్కసారి బారీ వర్షాలు కురవడంతో ఆ కల్వవర్టులు మళ్లీ కొట్టుకు పోయాయి. దీంతో తిరిగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు. స్థానిక నాయకులు ఆ కల్వర్టులకు తిరిగి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ముఖ్యంగా పాపాఘ్ని నదిపై ఉన్న కల్వర్టు తెగిపోతే అవతల వైపు కర్ణాటక రాష్ట్రం చేలూరుతో పాటు మన రాష్ట్రంలోని గుంటిపల్లె, రేకలగుంటిపల్లె, జంబుగానిపల్లె గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తోంది. అదే రంగసముద్రం గ్రామం బొంతవారిపల్లె కల్వర్టు వలన బొంతవారిపల్లె నెటరాయునిపల్లె గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి కల్వర్టులకు శాశ్విత నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాపాఘ్ననదిపై కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించండి



గత మూడు సంవత్సరాల నుంచి వర్షాలు వస్తే కల్వర్టు పై పయనించాలంటే భయం భయంగా గడుపుతున్నాం కల్వర్టు తెగిపోతే మండల కేంద్రానికి వెళ్లాలంటే కర్ణాటక రాష్ట్రం నుంచి చుట్టుకుని సుమారు 35 కిలో మీటర్లు వెళ్లి మండల కేంద్రానికి పోవాల్సిన దుస్థితి ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అదికారులు పాపాఘ్ని నదిపై శాశ్వతంగా కల్వర్టును నిర్మించి సమస్య పరిష్కరించండి

-సి. ఆంజనేయులు, చెన్నరాయునిపల్లె నివాసి, పీటీఎం

అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు



బొంతవారిపల్లె కల్వర్టు రెండుసార్లు బారీ వర్షాలకు కొట్టుకు పోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఒకసారి ప్రజాప్రతినిధులు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. తిరిగి మళ్లీ వర్షాలకు కొట్టుకుని పోవడంతో మా గ్రామస్తులం అంతా కలిసి శ్రమదానంతో తాత్కాలికంగా నిర్మించుకున్నాం అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలి

- రాజేష్, బొంతవారిపల్లె గ్రామ నివాసి, పీటీఎం

నిధులు మంజూరయ్యాయి

పాపాఘ్ని నదిపై కల్వర్టు నిర్మాణానికి ఆర్అండ్‌బీ ద్వారా రూ. 7కోట్లతో ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరయ్యాయి. కల్వర్టు మ్యాప్ డిజైన్ అయిన వెంటనే పనులు ప్రారంబిస్తాం బొంతవారిపల్లె , జంబుగానిపల్లె కల్వర్టులు పంచాయతీ రాజ్ శాఖకు సంబందించినవి. వాటిలో బొంతవారిపల్లె కల్వర్టు కోసం రూ. 1.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం నిధులు వస్తూనూ పనులు ప్రారంబిస్తాం.

- శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ శాఖ జేఈ

ఎడతెరిపి లేని వర్షం.. పంటలకు నష్టం



తాటిమాకులపల్లి సమీపంలో నేలకొరిగిన వరిపంట

పెద్దమండ్యం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) తుఫాన్ కారణంగా గురువారం నుంచి మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో పంటలకు నష్టం తప్పడంలేదు. వారం రోజుల క్రితం ఫెంగల్ తుఫాన్ కారణంగా వర్షాలకు వరి కోతలు చేయలేక పలు ఇక్కట్లు పడ్డారు. మళ్లీ గురువారం వర్షంతో పెద్దమండ్యం మండల వరి రైతుల్లో గుబులు రేగుతోంది. ప్రస్తుతం కోతకొచ్చిన వరి పంటలు నేలకొరిగాయి. కాగా గత వర్షాల కు దెబ్బతిన్న ధాన్యాన్ని ఆరుబయట ఆరబోసిన వరి రైతులు ఈ వర్షాలకు మొ లకెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు. పెద్దమండ్యం, సి.గొల్లపల్లి, కలిచెర్ల, వెలిగల్లు, శివపురం తదితర ప్రాంతాల్లో వరి నేలకొరిగింది. ప్రస్తుతం ఈదురు గాలులతో కూడిన వాన చలి ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్లు ఇమ్మానుయోల్, హరివర్మ వెల్లడించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలంలోని దండువారిపల్లె గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం కురిసిన వర్షానికి వర్షపు నీరు పాఠశాలలోకి చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో మనోహర్‌రాజు గ్రామానికి చేరుకుని పాఠశాల స్థితిగతులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నూతన భవనాల నిర్మాణం నిలిపివేశా రని పాత భవనాలలో నాణ్యత కూడా లోపించిం దని గ్రామస్థులు విన్నవించారు. స్పందించిన ఎం పీడీవో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నా రు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, మురళి గంగులప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.



పాఠశాలలో చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కలకడలో:అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే చలి తీవ్రత కారణంగా వృద్ధులు, చిన్నారులకు అవస్థలు తప్పలేదు. కూలీలు దొరకక టమోటా రైతులకు గడ్డుపరిస్థితి నెలకొంది. కాగా ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 6 గంటల దాకా 29.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహశీల్దార్ ఫణికుమార్ తెలిపారు.

వర్షాల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిమ్మనపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసీల్దార్ ధనంజేయులు సూచించారు. అలాగే బాహుదా ప్రాజక్టు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కంట్రోల్ రూమ్ నెంబరు 9390967127ను సంప్రదించాలన్నారు.

భూముల కబ్జాకు పాల్పడితే జైలుకే.. : ఎమ్మెల్యే



రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఎవరైనా కబ్జాలు చేస్తే వారిని ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద జైలుకు పంపడం ఖాయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. గురువారం మండలంలోని సీటీఎం -1 గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ ఆనందపార్థసారథి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని గ్రామస్థులు మాట్లాడుతూ సీటీఎం చెరువు పలుచోట్ల కబ్జాలకు గురైందని, శ్మశానాలను ఆక్రమించుకున్నారని, ప్రభుత్వ స్థలాల్లో షెడ్లు వేసుకుని అద్దెలకు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. రేగంటివారిపల్లె వద్ద దారిని అడ్డుకుని పొలాలకు వెళ్లనీయకుండా రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మొక్కుబ డిగా సదస్సులు నిర్వహిస్తే ప్రభుత్వం సహించదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అస్లాం, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పంచాయతీ కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

సదస్సుల్లో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేసిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ పేర్కొన్నారు. గురువారం తుమ్మరకుంట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో గ్రామీణ స్థాయిలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడానికే ప్రభుత్వం సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. తుమ్మరకుంట గ్రామంలో మొత్తం 155 అర్జీలు వచ్చాయని ఇందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 54, పెన్షన్లకు సంబంధించి 55, రేషన్ కార్డుల మంజూరు కొరకు 36, ఇంటి పట్టాలను మంజూరు చేయాలని 5 అర్జీలు, ఇతర అర్జీలు 5 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్, వీఆర్వో హైదర్ షా, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: గ్రామాల్లో నెలకొన్న భూముల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని గుండ్లపల్లె(వేమారెడ్డిగారిపల్లె) సచివాలయంలో రెవెన్యూ సదస్సులో రైతులు, గ్రామస్తుల నుంచి వివిధ సమస్యలపైన మొత్తం 10 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండ్ జోగేంద్ర, ఎఫ్‌బీవో రామరాజు, దేవదాయశాఖ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న వాల్మీకిపురం తహసీల్దారు పామిలేటి

పీలేరు/వాల్మీకిపురం/కలకడ/గుర్రంకొండ, డిసెంబరు 12(ఆం ధ్రజ్యోతి): భూ సమస్య లను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని పీలేరు, వాల్మీకిపురం తహసీల్దార్లు భీమేశ్వర రావు, పామిలేటి పేర్కొ న్నారు. పీలేరు మండలం బోడుమ ల్లువారిపల్లె, వాల్మీకిపురం మండలం విఠలం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. బోడుమల్లువారిపల్లెలో జరిగిన సదస్సులో వివిధ భూస మస్యలపై అధికారులకు 40 అర్జీలు అందాయి. వాటన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. అదే విధంగా కలకడ మండలం నవాబు పేటలో జరిగిన సదస్సులో అధికారులకు 17 అర్జీలు అందాయి. గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు భూముల విషయమై గొడవలకు పోకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాల న్నారు. అనంతరం ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీపతి, వీఆర్వోలు, నాయకులు ప్రేమకుమారి, రెడ్డిప్రసాద్‌నాయుడు, చలమారెడ్డి, హరిప్రసాద్‌నాయుడు, పాల్గొన్నారు.

మార్చి లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలపై సూచనలిస్తున్న ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి

తంబళ్లపల్లె, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి గృహాలు మంజూరైన లబ్దిదారులు 2025 మార్చి చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీ డీవో కార్యాలయంలో హౌసింగ్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి సత్వరమే బిల్లులు చెల్లింపులు చేయాలన్నారు.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి ఇంటి నిర్మాణం ఆపేసిన లబ్దిదారులకు వెలుగు సంఘాల ద్వారా రుణాలు అందించి నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, ఏఈ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పూజలు



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

వాల్మీకిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ మొదలు అభిషేకాలు, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం సాయంత్రం అయ్యప్ప భక్తుల భజనలు, పడిపూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో గురుస్వాములు శ్రీరాములు, శేఖర్, శీనా, భక్తులు పాల్గొన్నారు.

నేడు ధర్మపథంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయం లో శుక్రవారం ఉదయం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు, కల్యాణం, అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

నిమ్మనపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ధనంజేయులు హెచ్చరించారు. గురవారం బండ్లపై గ్రామపంచాయతి ఆవరణలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటివారైనాగాని చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని తెలిపారు. అలాగే డీకేటీ భూములను కొనడం, అమ్మడం చేయరాదని ఒక వేల పట్టాదారునికి అవసరము లేకపోలే ప్రభుత్వమే డీకేటీ భూములను స్వాధీనం చేసుకొంటుదని తెలిపారు. అలాగే పట్టాదారు కాకుండా వేరొకరి పేరున ఆన్‌లైన్ అవడం, యజమానులు చనిపోతే వారి భార్యలకు వన్‌బీ లేకపోవడం గతంలో ఇచ్చిన డీకేటీ భూములను వేరొకరు స్వాధీనం చేసుకోవడంపై పిర్యాదులు అందాయని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సులలో 181 అర్జీలు వచ్చాయని ప్రతి అర్జీకి సంబందించి 45రోజులలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఏవో రమేష్, కార్యదర్శి సరస్వతి, వీఆర్‌వో క్రిష్టప్ప నాయకులు లక్ష్మన్న, చెంద్రాయుడు, మల్లికార్జున. రమణ, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ



ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు డీఎం హెచ్‌వో డాక్టర్ శైలజా

మదనపల్లె అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను గురువారం అదనపు జిల్లా వైద్యశాఖాదికారిణి డాక్టర్ శైలజా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా డాక్టర్ శైలజా మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి ఆదేశాల మేరకు మదనపల్లె పట్టణంలోని వివిధ ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ సెంటర్లను, జనరల్ ఆస్పత్రిలోని టీబీ, లెప్రసి, హెచ్ఐవి, బ్లడ్ బ్యాంక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లును, రిజిస్టర్‌లను పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. ఫైర్ యాక్సిడెంట్స్ మీద సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా ప్రామాణికాలు పాటిస్తూ రెన్యువల్ చేసుకోవాలని, పొల్యూషన్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని, శానిటేషన్ శుభ్రంగా ఉండాలని, పేషెంట్లకు నీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 2025లోపు టీబీ రహిత దేశం కోసం క్షేత్రస్థాయి నుంచి క్షయ కేసులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ దయాలన్, ఎస్ ప్రభాకర్, శాంతి, టీబీ విభాగం సిబ్బంది సుశీల, వనజకుమారి, తరుణ్, సునీత, జయకుమార్, పుల్లయ్య, పురుషోత్తం, లీలా, భరత్, సుబ్బారెడ్డి, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలలో బి.కొత్తకోట చిన్నారుల ప్రతిభ



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న చిన్నారి

బి.కొత్తకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత కంఠస్థ శ్లోకాల పోటీలలో బి.కొత్తకోట పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ప్రశంసలు అందుకున్నారు. కుప్పం లోని శ్రీసుజ్ఞానానంద ఆశ్రమట్రస్టులో ఈనెల 11న గీతాజయంతి సందర్బంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలలో బి.కొత్తకోటకు చెందిన చిన్నారులు ప్రతిభ చూపి ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటాచలపతి గుప్త చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందుకున్నారు. మేడా వివేక్ కుమారుడు వివన్(11), కుమార్తె శ్రీకృతి(7)లు ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నారు.

రైల్వే అభివృద్ధికి కృషి చేయండి

నందలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని ఢిల్లీలో రైల్వేస్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎంపీ సీఎం రమేష్‌ను ఆయన నివాసంలో కలిసి కోరినట్లు బీజేపీ నాయకులు షబ్బీర్‌అహ్మద్, పోతురాజు మస్తానయ్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ రైల్వేమంత్రిత్వ శాఖతో చర్చించి నందలూరు రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని వినతిపత్రం ద్వారా కోరామన్నారు. బీజేపీ నేత హిమగిరినాథ్‌యాదవ్, టీడీపీ నేత సుధాకర్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుప్రమాదం తప్పింది. వివరాల మేరకు.. గురువారం కడప చెన్నై ప్రధాన రహదారి సాయిబాబా గుడి సమీపంలో సత్యవేడు ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ39జెడ్ 0190 బస్సు హైదరాబాద్ నుంచి తిరుపతికి వస్తుండగా కోడూరు నుంచి కడప వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో బస్సు పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ గాయపడ్డాడు. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

గోళ్లపల్లె వివాదంపై కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం

బి.కొత్తకోట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లె పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 427-బీ2బీ లో 2.27 ఎకరాలకు సంబంధించిన వివాదం పై గతనెల 25నే కలెక్టర్‌కు వివరణాత్మక నివేదిక ఇవ్వడం జరిగిందని తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ పేర్కొన్నారు. జిల్లాలో భూసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన 10మంది తహశీల్దార్‌లకు జిల్లా కలెక్టర్ మెమోలు ఇవ్వడం అందులో బి.కొత్తకోట తహశీల్దార్ కుడా ఉన్న నేపథ్యంలో ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడుతూ గోళ్లపల్లె భూసమస్యకు సంబంధించిన వివరాలను ఆధారాలతో సహా వివరించారు. 427-బీ2బీ లో పూరా విస్తీర్ణం2.27 డాటెడ్ ల్యాండ్ గా మాదిగ వెంకట్రాయుడు పేరున2.00 ఎకరాలు, మాదిగ చిన్ననరసింహుడు పేరున 0.13, వెంకట్రాయుడు పేరున 0.14 ఎకరాలు 1బి లో నమోదైందని ఈ భూమిపై వచ్చిన ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారణ జరిపి పూర్తి వివరాలను సమర్పించామన్నారు.

మోహన్‌బాబుకు ఇచ్చిన పద్మశ్రీని వెనక్కి తీసుకోవాలి

- ఏపీయూడబ్ల్యూజే డిమాండ్



మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు మోహన్‌బాబుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వాపసు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్ వద్ద ఏపీయూడబ్ల్యూజే నాయకులు అక్కులప్ప, వంశీధర్, రమేష్‌రాయల్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో టీవీ9 రిపోర్టర్ రంజిత్‌పై మోహన్‌బాబు దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుష చర్య అన్నారు. మోహన్‌బాబుపై నమోదు చేసిన హత్యాయత్నం కేసులో పోలీసులు అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీటీ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సురేష్, వాసు, కిరణ్, శ్రీధర్‌బాబు, శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ, ప్రసాద్, రవి, గంగాధర్ పాల్గొన్నారు.

రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు

పెద్దమండ్యం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో ఈనెల 14వ తేది (శనివారం) సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగునున్నట్లు తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ పేర్కొన్నారు. పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గురువారం విలేఖర్లతో మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలు నిష్పక్షపాతంగ నిర్వహించాలన్నారు. మండలంలోని 6 చెరువులకు పెద్దమండ్యం, కలిచెర్ల, సిద్దవరం, వెలిగల్లు గ్రామాల హైస్కూల్‌ల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగునున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల లోపు టీసీ సభ్యులను ఎన్నుకుంటారని 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు సాగునీటి సంఘ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎన్నికల నిబంధనలు తప్పని సరిగా సభ్యులకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులురెడ్డి, ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ, ఏవో సురేష్‌బాబు సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని తహసీల్దార్ తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన

రామాపురం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు రవాణా సౌకర్యాలు విస్తరిస్తున్న కొద్దీ రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోందని, వీటిని నివారించేం దుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రామాపురం ఎస్ఐ వెంకటసుధాకరరెడ్డిలు అన్నారు. బండపల్లి పంచాయతీ పరిధిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 50 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల యజమాని మన్నేరు భాస్కర్, పోలీసులు పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



వర్షం వస్తే చాలు ములకలచెరువు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణం నీరు నిలిచి చిన్న కుంటను తలపించడంతోపాటు ఆ ప్రాంతం బురదమయమవుతోంది. దీంతో ప్రజలు, ఉద్యోగులు కార్యాలయానికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. గురువారం కురిసిన వర్షానికి కార్యాలయ ప్రాంతం బురదగుంటగా మారింది. తుఫాన్ కారణంగా వర్షాలు పెరిగితే నీరు అధికంగా చేరుతుందని జనం వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-ములకలచెరువు, (ఆంధ్రజ్యోతి)

గుంతల రోడ్డుపై ప్రయాణం ఎలా..?



దుస్థితిలో నిమ్మనపల్లె రోడ్డు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో రోడ్డుపై ప్రయాణం సాగేదెట్లా అంటూ ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నిమ్మనపల్లె రోడ్డు నుంచి 15 గ్రామాల ప్రజలు మదనపల్లెకు రాకపోకలు సాగిస్తున్నారు. పదుల సంఖ్యలో ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అంతా గుంతల మయం కావడంతో ప్రమాదాలు తప్పించుకొంటూ ద్విచక్ర వాహనదారులు అతి కష్టంమీద గమ్యస్థానాలకు చేరుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ఆస్పత్రి పాలవుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం నరకయాతనగా మారింది. ఎటుచూసిన గుంతలే, వాటిని తప్పించబోయి రోడ్డు పక్కన పడిన ప్రమాదాలు ఎన్నో చోటుచేసుకున్నాయి. వాహనాలు దెబ్బతినడమే కాకుండా వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఈ రోడ్డుపై ప్రయా ణం చేయాలంటే ఇబ్బందులు పడాల్సిందే. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంకా గోతులు ఎక్కువ అయ్యాయి. దీంతో చేసిది లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు డబుల్ రోడ్డుకు అనుమతులు వస్తాయని ఆశలు కల్పిస్తున్నారే తప్ప కార్యరూపం దాల్చింది ఏమిలేదు. ఇందులో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న వాహనాలు అధికమే. ఎక్కువగా బసినికొండ, రామాచార్లపల్లె, ఆర్యవైశ్య ఆశ్రమం వద్ద ఎక్కువగా గుంతలు పడ్డాయి. రోడ్డు ఎప్పుడు బాగుపడుతుందా అని ప్రయాణికులు, ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.